Truth of News

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మహ్మద్ షఫీ అహ్మద్

IRS PUBLICATIONS

irspublications12@gmail.com

ఆదివారం 10 నవంబర్ 2024 తిరుపతి

సంపుటి 1 సంచిక 141 పేజీలు 08 వెల: రూ.6.00

Published from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi





భారత మాతృభూమి కోసం బ్రిటిష్ వారికి తల వంచని అమర వీరుడు షహీద్ టిప్పు సుల్తాన్

## తెలంగాణలో ..
# కుల గణన మొదలైంది

- మోడీ జీ దేశ వ్యాప్తంగా కులగణను మీరిక ఆపలేరు
- పార్లమెంట్ లో కుల గణన ఆమోదించి
- 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని తొలగిస్తాం
- 'ఎక్స్' వేదికగా బిజెపికి నేతలకు రాహుల్ గాంధీ కౌంటర్



**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని రేవంత్ రెడ్డి సర్కార్ కుల గణనను ప్రారంభించిందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఈ సమగ్ర డేటాను ఉపయోగించి రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధికి సంబంధించిన విధానాలను రూపొందిస్తామని వెల్లడించారు. త్వరలో మహారాష్ట్రలో కూడా ఇదే జరగనుందన్నారు. ఇకపై దేశ వ్యాప్తంగా జరగబోయే కులగణనను మోడీ జీ ఆపలేరన్నారు. ఈ మేరకు శనివారం సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ప్రధాని మోడి, బిజెపిపై రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చారు. దేశ వ్యాప్తంగా సమగ్ర కుల గణన చేపట్టడం బిజెపికి ఇష్టం లేదన్న సంగతి ఇప్పటికే ప్రజలందరికీ తెలిసిందని చెప్పారు. 'నేను మోడీ జీకి స్పష్టంగా చెప్పాలనుకుంటున్నా. దేశవ్యాప్తంగా కుల గణనను మీరు ఆపలేరు. త్వరలో

- మిగతా 2లో..

# మైనారిటీ లీడర్లకు... కీలక పదవులు



- ప్రభుత్వ సలహాదారు అహ్మద్ షరీఫ్
- మండలి సేవలకు సముచిత స్థానం..
- 'మౌలానా ముస్తాఖ్'కు ఫైనాన్స్ కార్పొరేషన్
- అధ్యాత్మిక వేత్త చేతికి 'సంక్షేమ' యంత్రం..
- సీఎం చంద్రబాబు నిర్ణయం భేష్
- పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు..
- ఇతర సీనియర్ల గుర్తింపునకు డిమాండ్..

**అమరావతి-సూర్య వాస్తవం, ఏపీ ప్రత్యేక ప్రతినిధి**

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల పందారానికి పచ్చజండా ఊపింది. ఎట్టకేట్టకేలకు రెండో విడత పోస్టుల జాబితాను శనివారం విడుదల చేసింది. తాజా లిస్టు మేరకు తెలుగుదేశం, జనసేన శ్రేణులకు భారీగానే పోస్టుల వడ్డన జరిగింది. మొత్తం మీద 59 విభాగాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సారథులను ఎంపిక చేశారు. నామినేటెడ్ నియామకాలు కూటమి నేతల్లో ఆనందోత్సాహాలు నింపాయి. ఇటీవల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అఖండ విజయానికి చేయూతనిచ్చిన ఇరువురు మైనార్టీ నేతలకు ఆయా నిర్ణీత విభాగాల్లో కీలక పదవులు దక్కాయి. వైఎస్ఆర్ సీపీ ఏలుబడిలో నిర్బంధాల నడుమ చతికిల పడ్డ తెలుగుదేశం పార్టీకి, జవసత్వాలు ప్రోదిచేసేందుకు దోహద పడ్డ మాజీ శాసన మండలి చైర్మన్ అహ్మద్ షరీఫ్ కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సముచిత స్థానం కట్టబెట్టారు. క్యాబినేట్ హెూదాతో మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుగా అహ్మద్ షరీఫ్ నియామకం పట్ల ఆ జన సముదాయంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



తెలుగుదేశం పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షులు మౌలానా ముస్తాఖ్ అహ్మద్‌కు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. ధార్మికవేత్త అయినప్పటికీ ముస్తాఖ్ అహ్మద్ ఎటువంటి భేషజాలకు పోకుండా అన్నింటా పార్టీ అభివృద్ధికి విశేష సేవలందించారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆయన ప్రజా వ్యతిరేక విధానాలపై తరుచూ గళం విప్పుతూ.. తనదైన శైలిలో సుదీర్ఘ పోరాటాలు కొనసాగించారు. మౌలానా అనేక

- మిగతా 2లో..



## మదనపల్లెను కుదిపేసిన
# ఏసీబీ అధికారుల తనిఖీలు

- తిరుపతి, మదనపల్లెల్లో ఏక కాలంలో అధికారుల ఇళ్లల్లో విస్తృతంగా సోదాలు
- పాత ఆర్డీవో మురళీ ఇంట్లో పలు ఫైల్లు స్వాధీనం
- ఆర్డీవోకు బినామీగా వ్యవహరించాడని వీఆర్వో శేఖర్ ఇంట్లోనూ ఏసీబీ తనిఖీలు
- నాలుగు బృందాలుగా ఏర్పడి మదనపల్లిలో సోదాలు చేపట్టిన ఏసీబీ
- అక్రమ ఆస్తులు ఉన్నట్లు తనిఖీలు చేపట్టాం
- సీఐలు హేమంత్ కుమార్ రెడ్డి, మోహన్ ప్రసాద్ వెల్లడి

**మదనపల్లె క్రైమ్-సూర్య వాస్తవం**

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టరేట్లో ఫైళ్ల దగ్ధం కేసులో సిఐడి అధికారులు ఒకవైపు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టగా ఇపుడు సిఐడి అధికారులు ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని రంగంలోకి దిగారు. ముప్పేట దాడులు చేస్తుండడంతో మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఫైళ్ల దహనం కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న పూర్వపు ఆర్డీవో మురళికి ముచ్చెమటలు పడుతున్నాయి. శనివారం వేకువజామున తిరుపతి, మదనపల్లె లో ఉన్న గత ఆర్డీఓ మురళి నివాసాలలో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మదనపల్లి పట్టణంలోని ప్రశాంత్ నగర్ లోని మురళి నివాసం తో పాటు, తిరుపతిలో ఆయన కుమారుడు నివసిస్తున్న ఇంటిలో కూడా ఏసీబీ అధికారులు తనిఖీలుచేశారు. అదేవిధంగా ఆర్డీఓ మురళికి అనుకూలస్తుడుగా ఉన్న మదనపల్లె పొన్నేటి పాలెం శేఖర్ ఇంటిలోనూ ఏసీబీ అధికారులు ఏకకాలంలో విస్తృత తనిఖీలు చేశారు. అయితే వైసిపి ప్రభుత్వ పాలనలో ఫ్రీ హెూల్డ్ భూములను నిషేధిత జాబితాలో నుంచి తొలగించ డంలో మురళి కీలక పాత్ర పోషించారని అభియోగాలు ఉన్నాయి. ముఖ్యంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అనుచరుడుగా వ్యవహరించిన

- మిగతా 2లో..



మీడియాకు వివరాలను వెల్లడిస్తున్న ఏసీబీ సీఐ మోహన్ ప్రసాద్



## విజయవాడలో
# సీ ప్లేన్ ప్రారంభం

- శ్రీశైలంకు ముఖ్యమంత్రి ప్రయాణం



**విజయవాడ-సూర్య వాస్తవం**

ఏపీ సీఎం చంద్రబాబు విజయవాడలోని పున్నమిఘాట్‌లో సీ ప్లేన్‌ను ప్రారంభించారు. శనివారం ఉదయం సీ ప్లేన్ పర్యాటకాన్ని చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించారు. సిఎంతోపాటు పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, పలువురు ప్రభుత్వ అధికారులు కలిసి సీ ప్లేన్ లో శ్రీశైలంకు బయలుదేరారు. అక్కడ మల్లికార్జున స్వామిని ఆయన దర్శించుకోనున్నారు. సాయంత్రం తిరిగి విజయవాడకు వచ్చారు. 14 సీట్ల సామర్థ్యంతో సీ ప్లేన్‌ను రూపొందించారు. త్వరలో ఇది సామాన్య ప్రయాణీకులకు అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ భవిష్యత్

- మిగతా 2లో..




# అర్హులందరికీ గృహనిర్మాణాలు

- రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

**తిరుపతి -సూర్య వాస్తవం**

డిసెంబర్ 2024 నాటికి రాష్ట్రంలో లక్ష ఇల్లు పూర్తిచేసి లబ్ధిదారులకు ఇంటి తాళం చెవులు అప్పచెప్పే బృహత్తర కార్యక్రమం ముఖ్యమంత్రి చేతుల మీదుగా చేపట్టనున్నామని, అర్హులైన ప్రతి పేదవారికి ఇల్లు కల్పించాలనేది సిఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు ఆంధ్ర రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి ఉమ్మడి చిత్తూరు తిరుపతి జిల్లాలలో హౌసింగ్ శాఖపై సమీక్ష నిర్వహించారు. అనంతరం పాత్రికేయుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ పిఎంఎవై 1 ఓ పథకం లో భాగంగా ఈ రెండు జిల్లాలకు మంజూరు అయిన గృహాలు సుమారుగా 50 శాతం పూర్తి అయ్యాయని, కొన్ని చోట్ల 70 శాతం మేర పూర్తి అయిందని తెలిపారు. కొన్ని చోట్ల ఇసుక కొరత, వర్షం

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# అర్హులందరికీ గృహనిర్మాణాలు

(మొదటిపేజీ తరువాయి)

కారణంగా ఆలస్యం కావడంతో సకాలంలో గృహ నిర్మాణ పనులు పూర్తి స్థాయిలో జరగలేదని తెలిపారు. సదరు అంశంపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలలో గృహ నిర్మాణ పనుల పురోగతిపై జాయింట్ కలెక్టర్, సంబంధిత అధికారులతో సమీక్ష జరిపామని అన్నారు. అదేవిధంగా ఎన్టీఆర్ హౌసింగ్ నిర్మాణాలకు లే ఔట్స్ కు ఇసుకను ప్రాధాన్యత గా ఇవ్వాలని అధికారులను ఆదేశించామన్నారు. గృహ నిర్మాణానికి సంబంధించిన ఇసుక అవసరాల కొరకు అందుబాటులోని ఇసుకను ట్రాన్స్పోర్ట్ చేసుకోమని సూచించామని, సదరు రవాణా చార్జీలను గృహ నిర్మాణశాఖ భరించెల ఆదేశించామని తెలిపారు. అదే విధంగా స్థానిక ఎమ్మెల్యే లు వారి నియోజకవర్గంలో గృహ నిర్మాణాలలో కొన్ని సమస్యలను, అవకతవకలు ఉన్నాయని తెలియపరిచారని, వాటిని కూడా త్వరలో అన్నిటికి పరిష్కారం చూపుతామన్నారు. గృహ నిర్మాణాలలో లోపాలను ఉన్నతాధికారులకు పంపాలని ఆదేశించామని తెలిపారు. అదేవిధంగా కుప్పంలో ఇల్లు నిర్మాణం జరిగాయి కానీ, దానికి కావలసిన విద్యుత్ సౌకర్యమును రెస్కో, ఏపీఎస్పీడిసిఎల్ వారు సమన్వయంతో ఏర్పాటు చేయవలసి ఉందని అన్నారు.

అక్కడ నిర్మాణం జరిగిన ఇళ్ళకు విద్యుత్ కొరత లేకుండా కొత్త సబ్ స్టేషన్ ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించామన్నారు. అదేవిధంగా లే ఔట్ లలో మౌళికవసతుల ఏర్పాటు గురించి శాసన సభ్యులకు వారి నియోజకవర్గంలో వారికి మంజూరు అయిన నరేగా నిధుల్లో నుండి కొంత నిధులను కాలనీలలో మౌలిక వసతులకొరకు ఉపయోగించాలని ఎమ్మెల్యే లను కోరామని తెలిపారు. కేంద్రం నిధులు జలజీవన్ మిషన్, అమృత్, నరేగా నిధుల నుండి కాలనీ లలో మౌలిక సదుపాయాలు నిబంధనల మేరకు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించామని తెలిపారు. అదేవిధంగా ముఖ్యమంత్రి గారు కూడా హౌసింగ్ పై ఎక్కువ శ్రద్ధ కనబరుస్తున్నారని ముఖ్యంగా ఇళ్ల నిర్మాణంలో ఎటువంటి అవక తవకలకు అవకాశం లేకుండా క్వాలిటీ పరంగా రాజీ లేకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ల సమావేశంలో అదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. పేద ప్రజలకు ఈ ప్రభుత్వం మంచి నాణ్యమైన ఇళ్లను నిర్మించి ఇస్తామని తెలిపారు. ఇంటి నిర్మాణంలో ఏమైనా సమస్యలు ఉంటే హౌసింగ్ శాఖ వారు పరిష్కారం చేస్తారన్నారు. అదేవిధంగా వినియోగ దారుడు ఇళ్ల నిర్మాణం చేపట్టి హౌసింగ్ వారికి బిల్లులు సమర్పించిన వారం లోపల వాటి ఖాతాలో డబ్బులు జమ అవుతాయన్నారు. మార్చి 2025 నుండి పిఎంఎవై 2.0 కార్యక్రమం ప్రారంభం కానుందని తద్వారా కేంద్ర ప్రభుత్వం నుండి ఇళ్లను మంజూరు చేసి ప్రతి పేద వారికి ఇళ్లను అందిస్తామని తెలిపారు. టిడ్కో గృహాల బాధితులను ఆదుకుంటాం.

గతంలో 2014-19 కాలంలో నిర్మించిన టిడ్కో ఇల్లు 90 శాతం పూర్తయిన వాటిని కూడా గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం చేసి లబ్ధిదారులను ఇబ్బందికి గురి చేశారని తద్వారా లబ్ధిదారులను నష్టపోయారని తెలిపారు. హౌసింగ్ కాలనీల్లో మౌలిక వసతులను కేంద్ర పథకాలు నరేగా, అమృత్, జల జీవన్ మిషన్ తదితర పథకాల అనుసంధానంతో చేపడుతున్నామని అన్నారు. బాధ్యతగా గృహాల నిర్మాణాలకు లక్ష్యం నిర్దేశించుకుని పూర్తి చేసేలా, లబ్ధిదారులను మోటివెట్ చేసి, సంబంధిత శాసన సభ్యులు, ప్రజా ప్రతినిదులు సహకారంతో స్టేజి కన్వర్షన్ జరిగేలా చర్యలు చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామని అన్నారు. బిల్లుల చెల్లింపుకు నిధుల కొరత లేదని తెలుపుతూ, లబ్ధిదారులకు బిల్లులు నిధులు ఉన్నా చెల్లించకుండా నిర్లక్ష్య వైఖరి వహిస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. గత ప్రభుత్వ హయంలో హౌసింగ్ లో జరిగిన అవకతవకలపై విచారణ జరుగుతోందని అన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందు చూపుతో ఎలక్ట్రానిక్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ ను అందిపుచ్చుకుని పలు జిల్లాలో ఏర్పాటు చేశారని ఇది ముందు చూపు గల ప్రభుత్వం అని అన్నారు. రానున్న సంక్రాంతి నాటికి రాష్ట్రంలోని రాష్ట్ర రహదారులు, ముఖ్య రహదారులు అన్నీ గుంతలు లేకుండా మరమ్మతులు చేపట్టి గుంతలు లేని రాష్ట్రంగా తయారు చేయడానికి కంకణ బద్ధులై ఉన్నామని తెలిపారు. సోషల్ మీడియాను తప్పుగా వాడుతూ రాజకీయ లబ్ధికి వాడడం సరికాదని, మహిళలను కించ పరిచే విధంగా ప్రభుత్వాన్ని తప్పు పట్టడానికి దీనిని వాడుతున్న వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. జుగుప్సాకరంగా పోస్టులు పెట్టే వారిని వదిలిపెట్టేది లేదని, మహిళలు, చిన్నారులపై ఇష్టానుసారం పోస్టులు పెడితే కఠినంగా శిక్షిస్తామని అన్నారు. నాలుగు నెలల్లో ప్రజారంజకమైన పాలనను అందించామని, ప్రభుత్వాన్ని విమర్శించలేక కొందరు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. సమీక్షలో జెసి శుభం బన్సల్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వెంకటగిరి ఎమ్మెల్యే కొరగొండ్ల రామకృష్ణ, పూతల పట్టు ఎమ్మెల్యే మురళి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చీఫ్ ఇంజనీర్ జీవి ప్రసాద్, ఎస్ఈ నాగభూషణం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, చిత్తూరు ఉమ్మడి జిల్లా ఆర్డీఓలు, తాశిల్దార్లు, హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడలో సీ ప్లేన్ ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

అంతా పర్యాటకానిదేనన్నారు. భవిష్యత్‌లో ఏ యిజం ఉండదు.. టూరిజం ఒక్కటే ఉంటుందని చెప్పారు. దేశంలో తొలిసారి పర్యాటకంగా 'సీ ప్లేన్' వినియోగం ఏపీ నుంచి ఆరంభం అయ్యిందని హర్షాన్ని వ్యక్తం చేశారు. తక్కువ సమయంలోనే అత్యున్నత స్థానానికి ఎదిగిన వ్యక్తి రామ్మోహన్ నాయుడు అని కేంద్ర మంత్రివర్గంలో అత్యంత యువకుడాయన అని కొనియాడారు. సీప్లేన్ ప్రయాణం.. వినూత్న అవకాశమిది. రాష్ట్రంలో అభివఅద్ధి జరగాలి. సంపద సఅష్టిస్తేనే ఆదాయం పెరుగుతుంది. సాంకేతికత చాలా వేగంగా పెరుగుతోంది. దానిని పూర్తిగా వినియోగించుకోవాలి. ఐటీ అంటే ఆనాడు ఎగతాళి చేశారు. ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడ చూసినా మనవాళ్లే ఉన్నారు. అనునిత్యం కొత్త ఆలోచనలు చేయాలి. రాబోయే రోజుల్లో విమానాశ్రయాలే కాకుండా సీప్లేన్ ద్వారా రవాణా సౌకర్యం లభిస్తుంది " అని చెప్పారు. "రాష్ట్రంలో విధ్వంసమైన వ్యవస్థను బాగుచేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం. ఎంత త్వరగా అనుకున్న ప్రగతిని సాధించాలనేదే ఆలోచిస్తున్నాం. గాడితప్పిన పరిపాలనను సరిచేయడమే నా లక్ష్యం. ఏపీలోని రోడ్లను చూసి అవహేళన చేశారు. పోగొట్టిన బ్రాండ్‌ను తిరిగి తీసుకొచ్చే బాధ్యత తీసుకున్నాం. ప్రజలు గెలవాలి.. ఎన్డీయేకు ఓటేయాలని నేను, పవన్, నరేంద్ర మోడీ కోరాం. ఏపీ ప్రజలు గెలిచారు.. మన రాష్ట్రాన్ని నిలబెట్టారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ప్రజలు ఆక్సిజన్ ఇచ్చారు." అని చంద్రబాబు అన్నారు.

# తెలంగాణలో .. కుల గణన మొదలైంది

(మొదటిపేజీ తరువాయి)

పార్లమెంట్‌లోనే కుల గణనను ఆమోదించి రిజర్వేషన్ల పై ఉన్న 50 శాతం పరిధిని బద్దలు కొడతాం' అని ట్వీట్ చేశారు. తెలంగాణ సర్కార్ చేపట్టిన కులగణన సర్వే పై కాంగ్రెస్ విడుదల చేసిన హింది సాంగ్ తో కూడిన వీడియోను ఈ ట్వీట్ కు అటాచ్ చేశారు. ఇందులో తెలంగాణ గవర్నర్ బిష్ణు శర్మ డేటాను సేకరిస్తోన్న అధికారులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కుల గణన సర్వే జరుగుతోన్న తీరు చూడవచ్చు.

# మైనార్టీ లీడర్లకు కీలక పదవులు..!

(మొదటిపేజీ తరువాయి)

సందర్భాల్లో అక్రమ కేసులు ఎదుర్కొంటూనే పార్టీ విజయానికి రాష్ట్ర వ్యాప్త పర్యటనలు జరిపి మైనార్టీలను పార్టీకి అనుకూలంగా సమీకరించారు.



**విశేష సేవలకు అపూర్వ గుర్తింపు:-**

తొలిజాబితాలోనే వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన నెల్లూరు మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్ సైతం తెలుగుదేశం పార్టీకి విశేష సేవలందించిన వ్యక్తిగా అధిష్ఠానం వద్ద మంచి గుర్తింపు పొందారు. 'కూటమి' పొత్తు కారణంగా తెలుగుదేశం పార్టీకి మైనార్టీల మద్దతు అన్నింటా సంపూర్ణంగా లభించనప్పటికీ.. ఆ పార్టీ ప్రకటించిన ముగ్గురు మైనార్టీ అభ్యర్థులు అసెంబ్లీ ఎన్నికల్లో విజయఢంకా మోగించారు. వారిలో నంద్యాల ఎమ్మెల్యే ఎన్.ఎం.డి.ఫారూఖ్ సుదీర్ఘ సేవలను గుర్తించిన పార్టీ అధిష్ఠానం అత్యంత ప్రాధాన్యత కల న్యాయశాఖ మంత్రిత్వాన్ని కట్టబెట్టి సముచిత గౌరవ మర్యాదలు అందించింది. 'నామినేటెడ్' రెండో జాబితాల్లో కీలక పదవులు దక్కించుకున్న ఇరువురు సీనియర్ నేతల నిమామకం పార్టీ మైనార్టీ వర్గాల్లోనే కాక పార్టీ శ్రేణులందరిలోనూ ఆమోదయోగ్యంగా ఉంది. ప్రస్తుతం మైనార్టీ సలహాదారుగా క్యాబినేట్ హెూదాలో నియమితులైన అహ్మద్ షరీఫ్ సుదీర్ఘంగా పార్టీకి విశేష సేవలందిస్తూ వస్తున్నారు. తెలుగుదేశం వ్యవస్థాపకులు సర్గీయ ఎన్టీఆర్ అందించిన ప్రేరణతో ఆ పార్టీలో ఆయన సామాన్య కార్యకర్తగా తన రాజకీయ ప్రస్థానం ఆరంభించారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో అనేక ఎత్తు పల్లాలు చవిచూస్తూ .. ప్రస్తుత ముఖ్యమంత్రి,ఆ పార్టీ అధినేత చంద్రబాబు ప్రోత్సాహంతోనూ..ప్రోద్బలంతోనూ ప్రతిష్ఠాత్మకమైన శాసన మండలి చైర్మన్ పదవిని పొందగలిగారు. శాసన మండలి చైర్మన్ హెూదాలో కొనసాగుతూనే ఆయన తెలుగుదేశం పార్టీ పునర్జీవనానికి అత్యంత కీలక పాత్ర పోషించారు. అనేక దఫాలుగా పార్టీ పరమైన అందలాలు పొందినప్పటికీ.. ఇసుమంతైన గర్వాతిశాయలకు పోకుండా పార్టీకి అన్నింటా అన్నీ సమయాల్లో విరవిధేయునిగా ఉంటూ తనవంతు కర్తవ్యాన్ని పార్టీపట్ల అంకిత భావంతో నిర్వహిస్తూ వస్తున్నారు.

**మూడు రాజధానుల బిల్లు కీలకం:-**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తెలుగుదేశం పార్టీకి ప్రాణ సంకటంగా మారిన మూడు రాజధానుల బిల్లును సెలక్ట్ కమిటీకి పంపడం ద్వారా మండలి చైర్మన్ హెూదాలో అహ్మద్ షరీఫ్ ముఖ్య భూమిక పోషించారు. తద్వారా ఊగిసలాటల్లో కొనసాగుతున్న తన పార్టీ ఊపిరిని నిలపగలిగారు. అధికార బలంతో అన్నింటా ఆధిక్యం సాధిస్తూ వచ్చిన వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం, సెలక్ట్ కమిటీ నిర్ణయం కారణంగా తొలి వైఫల్యాన్ని ఎదుర్కొనక తప్పలేదు. అనేకానేక ప్రలోభాలు,బెదింపులు ఒత్తిడిల మధ్య..అప్పటి సంకట పరిస్థితుల నేపథ్యంలో పార్టీ పున:ప్రతిష్ఠకు వెన్నుదన్నుగా నిలిచినది సెలక్ట్ కమిటీ ఏకైక నిర్ణయమే., ఆ తరువాత పరిణామాల నేపథ్యంలో ఆపార్టీకి నేటి అఖండ విజయానికి,అధికారిక అందలాలకు దోహద పడింది కూడా సెలక్ట్ కమిటీ నిర్ణయమే. అప్పటి ప్రభుత్వ పెద్దలు సామ,బేధ,దాన..దండోపాయాలు అనేకం ప్రయోగించి మండలి చైర్మన్‌గా, ఆయన్ను లొంగదీసుకునే ప్రయత్నం చేసినా., అవి ఆయన ముందు చెల్లుబాటు కాలేదు. ఆనాటి ప్రలోభాలు, పదవుల బేరసారాలన్నీ పార్టీ పట్ల ఆయనకున్న మక్కువ విధేయత,అంకిత భావం ముందు దిగదుడుపు అయ్యాయి. తెలుగుదేశం పార్టీ మనుగడకు ప్రశ్నార్థకంగా మారిన అప్పటి సంకట స్థితిని అహ్మద్ షరీఫ్ విజ్ఞతతో..అంతకు మించి స్థిత ప్రజ్ఞతతో తీసుకున్న నిఖార్సయిన నిర్ణయం పార్టీ శ్రేణుల్లో ఆత్మస్థైయిర్యం పెంపొందించిదంతో పాటు, అలుపెరగని పోరాట పటిమను రగిల్చింది.

**ప్రాధాన్యతల్లో అన్నింటా సమతూకం:-**

మూడు రాజధానుల వ్యతిరేక ఉద్యమం మూడేళ్లకు పై బడి ఎకాబికిన విరామం లేకుండా వెల్లువలా కొనసాగడంలో మండలి చైర్మన్ హెూదాలో అహ్మద్ షరీఫ్ తీసుకున్న కీలక నిర్ణయం తన వంతుగా అద్వితీయమైన పాత్రను పోషించింది. తెలుగుదేశం పార్టీ పరువు ప్రతిష్ఠతలకు ప్రతీగా నిల్చిన ఆ నిర్ణయాన్ని ఆ పార్టీ అధినాయకత్వంతో పాటు పార్టీ శ్రేణులు మనసారా స్వాగతించాయి. అహ్మద్ షరీఫ్ చిత్ర పటాలకు అమరావతి గ్రామాల్లో పాలభిషేకాలు నిర్వహించి అందుకు తమ హర్షాతిరేకలను వ్యక్తపర్చారు. పదవులు ఎన్ని వరించినా ఎనాడు కించిత్ గర్వాన్ని ప్రదర్శించని ఆయన పార్టీకి అన్నింటా విధేయత ప్రకటిస్తూనే.. తనదైన ముస్లిం సమాజిక వర్గ బాగోగుల పట్ల శ్రద్ధాశక్తులు కనబరుస్తూ వస్తు న్నారు. జాతీయ రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పలు మార్లు మైనార్టీ ప్రయోజనాలకు విఘాతం కల్గిస్తూ వస్తున్న దేశ స్థాయి నిర్ణయాల పట్ల.. తెలుగుదేశం పార్టీ జాగరూకత కల్గి ఉండే విధంగా అప్రమత్తం చేస్తూ వస్తున్నారు. తమ పార్టీ అధినేత చంద్రబాబును కీలక విషయాల్లో ఒప్పించి., తదనుగుణంగా నిర్ణయాలు వెలువడేందుకు తన దైనశైలిలో అత్యంత చాకచక్యంగా కృషి చేస్తూ వస్తున్నారు. ఎన్నార్సీ,సీఏఏ తర హాలో 'వక్ఫ్' సవరణ బిల్లు ఆ సామాజిక వర్గం ప్రయోజనాలకు విఘాతం కల్గిస్తున్న నేపథ్యంలో.. పలుమార్లు అధినేత చంద్రబాబుకు 'వక్ఫ్' బిల్లు సున్నితత్వాన్ని వివరించే ప్రయత్నం చేశారు. ఈ విషయమై తాను ఆశించిన మేరకు పార్టీ పరంగా.., తమ వంతు ఫలితాన్ని సాధించగలిగారు. అహ్మద్ షరీఫ్ సమయానుకూలంగా సహనం వహిస్తూనే.. మైనార్టీల ప్రయోజనాలు కాపాడే అంశమై అత్యంత జాగరూకత వహిస్తూ ముస్లిం సమాజం మన్ననలు పొందుతూ వస్తున్నారు. మైనార్టీ విభాగం సలహాదారుగా ఆయన పాత్ర ఒక వైపు ఆ జనసముదాయానికి,మరో వైపు ఆయన నమ్ముకున్న తెలుగుదేశం పార్టీకి అత్యంత ప్రయోజన కరం కానుంది.

**మైనార్టీలకు మరిన్ని పదవులకు విజ్ఞప్తి :**

అధికార పార్టీ తమ పార్టీ మైనార్టీ నేతలకు సముచిత అవకాశాలు కల్పించే విషయమై చిత్తశుద్ధి ప్రదర్శిస్తున్నప్పటికీ., పార్టీ ఆరంభం నాటినుంచి అంకిత భావంతో పార్టీతో మమేకమైన ఇతరత్రా సీనియర్ మైనార్టీ నేతలకు, వివిధ స్థాయిలో పార్టీకి సేవలందిస్తున్న యువనేతలకు గుర్తింపు విషయమై ఇంకా ఎంతో కొంత అసంతృప్తి మిగిలి ఉంది. పార్టీకి ఉచిత రీతిన అంకిత భావంతో సేవలందిస్తున్న మైనార్టీ నేతలకు కేవలం సంబంధిత మైనార్టీ విభాగాల పదవులకే పరిమితం చేయడం సమజసం కాదనే అభిప్రాయం వారిలో నెలకొంది. స్వచ్ఛంద సేవలు అందిస్తూ తెలుగుదేశం పార్టీ విజయానికి దోహద పడ్డ సామాజిక వేత్తలను గుర్తించి, తగురీతిన సముచిత పదవులను కేటాయించాలనే డిమాండ్ కొందరి నుంచి వ్యక్త మవుతుంది. తెలుగుదేశం పార్టీకి వివిధ స్థాయిల్లో వివిధ ప్రాంతాలనుంచి అనాదిగా సేవలందిస్తూ వస్తున్న వారిని అధిష్ఠానం గుర్తించి, కేవలం మైనార్టీ విభాగంలోనే కాకుండా ఇతర విభాగాల్లో కూడా పదవులు కేటాయించాలని పలువురు కోరుతున్నారు. తద్వారా పార్టీ అధిష్ఠానం మైనార్టీ జనసముదాయంలో నెలకొన్న నాయకత్వ లేమిని దూరం చేయాలని, వివిధ స్థాయి నేతలు తో పాటు, ఆ సామాజిక వర్గం ఉన్నతిని ఆశించే పలువురు పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకువిజ్ఞప్తి చేస్తున్నారు.


## మహ్మద్ అహ్మద్ షరీఫ్

**ఆంధ్రప్రదేశ్ శాసనమండలి మాజీ చైర్మన్**

మహ్మద్ అహ్మద్ షరీఫ్ ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్. 2019 ఫిబ్రవరి 7 బాధ్యతలు స్వీకరించాడు. అతను తెలుగు దేశం పార్టీ సభ్యుడు.

**జీవితం తొలిదశ**

మహ్మద్ ఖాసిమ్ షరీఫ్ దంపతులకు జన్మించాడు. ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంకు చెందినవాడు. నరసాపురంలోని శ్రీ వైఎన్ కాలేజీ నుండి బ్యాచిలర్ ఆఫ్ కామర్స్ డిగ్రీ పొందాడు. అతను భోపాల్ విశ్వవిద్యాలయం నుండి 1978 లో మాస్టర్ ఆఫ్ కామర్స్, 1979 లో ఎల్ఎల్బి చేసాడు.



**రాజకీయ జీవితం**

1982లో ఎన్.టి.రామారావు తెలుగుదేశం పార్టీ ప్రారంభించినప్పటి నుండి షరీఫ్ సభ్యుడిగా వున్నాడు. జాతీయ ప్రధాన కార్యదర్శితో సహా పార్టీలో వివిధ పదవులు నిర్వహించాడు. షరీఫ్‌ను శాసనమండలి సభ్యునిగా, తరువాత కౌన్సిల్‌లో ప్రభుత్వ విప్‌గా నియమించారు. 2019 ఫిబ్రవరి 7న షరీఫ్ ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఛైర్మన్‌గా ఎన్నికయ్యాడు. జగన్ ప్రభుత్వం ప్రతిపాదించిన మూడు రాజధానుల బిల్లు శాసనమండలిలో చర్చించినపుడు సెలెక్ట్ కమిటీకి పంపాలని నిర్ణయం వివాదాస్పదమైంది. దీనిని అధికారపక్షం వ్యతిరేకించి శాసనమండలి రద్దు చేసే ప్రయత్నం ప్రారంభించింది. తెదేపా వర్గీయులు దీనిని స్వాగతించారు. అమరావతి ప్రాంతవాసులు, షరీఫ్ చిత్రానికి పాలాభిషేకం చేశారు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఛైర్మన్‌గా 2021 మే 24 వరకు పనిచేసారు.

# మదనపల్లెను కుదిపేసిన ఏసీబీ అధికారుల తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

ఆర్డీవో మురళి హయాంలోనే, ఫోర్జరీ సంతకాలతో వైసీపీ ప్రధాన నాయకులు పేదల నుంచి బలవంతంగా కొనుగోలు చేసిన భూములను ఫ్రీ హెూల్డ్ జాబితాలో ఎక్కించడంలో ఆర్డీవో మురళి కీలక పాత్ర పోషించారని అనుమానాలు ఉన్నాయి.

జూలై 21వ తేదీన మదనపల్లి సబ్ కలెక్టరేట్ లో ఫైళ్ల దహనం జరిగిన ఘటనపై కూటమి ప్రభుత్వం సీరియస్గా తీసుకుంది. ఇందులో భాగంగా రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు , అప్పటి సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యాన్నార్, ప్రత్యేక హెలికాప్టర్లో మదనపల్లికి చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించిన విషయం తెలిసిందే. అనంతరం వరుసగా చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో వైసిపి మదనపల్లె మాజీ ఎమ్మెల్యే నవాజ్ భాష, మునిసిపల్ వైస్ చైర్మన్ జింక వెంకటా చలపతి, రైస్ మిల్ మాధవరెడ్డి,సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ, వి ఆర్ ఏ రమణయ్యలతో పాటు ప్రధాన నిందితులుగా పాత ఆర్డిఓ మురళి, అప్పటి ఆర్డీవో హరిప్రసాద్ లపై ప్రభుత్వం కేసులు నమోదు చేసింది.

అనంతరం నలుగురు అధికారులు సస్పెండ్ అయ్యారు. అనంతరం కేసు సిఐడికే బదిలీ కావడంతో సిఐడి అధికారులు తమదైన స్టైల్ లో లోతుగా దర్యాప్తు చాప కింద నీరుల చేపట్టారు. ఆ దర్యాప్తు నేటికీ కొనసాగుతుండడంతో మరోవైపు సిఐడి అధికారులు ఆదాయానికి మించిన ఆస్తులు అప్పటి పాత ఆర్డిఓ మురళి కలిగి ఉన్నాడని తాజాగా తిరుపతి ఏసీబీ డిఎస్పి జెస్సీ ప్రశాంతి కేసు నమోదు చేసి తిరుపతి మదన పల్లెలలో పలు బృందాలతో ఏకకాలంలో ఇళ్లల్లో సోదాలు









చేపట్టి తనిఖీలు చేసింది. ఏసీబీ అధికారుల తనిఖీలలో ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని వారి వద్ద పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు హేమంత్ కుమార్ రెడ్డి, మోహన్ ప్రసాద్ మీడియాకు బహిర్గతం చేశారు. కేసు మొత్తం తిరుపతిలో జరుగుతుందని. తమ పై అధికారి డిఎస్పీ మీడియా సమావేశంలో పూర్తి వివరాలతో వెల్లడి చేస్తారని తెలిపారు... ఇదిలా ఉండగా ఏసీబీ అధికారులు మదనపల్లెలో ఏకకాలంలో బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేస్తున్నారని వార్తలు సోషల్ మీడియా, టీవీ ఛానల్ లలో రావడంతో అవినీతి అధికారులతో పాటు, వైసీపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి...

# పెరిగిన ట్రూ అప్ చార్జీలు రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి

**చిత్తూరు - సూర్య వాస్తవం:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచాబో మని ప్రకటించి ఇప్పుడేమో అధికారం లోకి వచ్చిన 5 నెలలకే రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జి ల పేరుతో రూ 6072 కోట్లకు పైగా విద్యుత్ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని ఈ రోజు శనివారం స్థానిక పెన్షనర్స్ హోమ్ లో కేశవులు రెడ్డి అధ్యక్షతన జరిగిన వివిధ ప్రజా సంఘాల నాయకులతో జరిగిన సదస్సురాష్ట్ర ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేసింది. సదస్సు లో మన చిత్తూరు అభివృద్ధి వేదిక కార్యదర్శి చైతన్య, నగర అభివృద్ధి కమిటీ కార్యదర్శి సురేంద్రనాథ్, సంతపేట అభివృద్ధి కమిటీ అధ్యక్షలు ద్వారకనాథ్, శ్రీనివాస మూర్తి, న్యాయవాది చక్రవర్తి రెడ్డి, ముస్లిం ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు నౌషాద్, ఉపాధ్యక్షులు రసీద్, ప్రధాన కార్యదర్శి ఇ నాయాతుళ్ళ రిటైర్డ్ ప్రిన్సిపాల్స్ జిల్లా అధ్యక్షులు అజమాతుల్లా, ఎస్సి. ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామి, క్రైస్తవ అసోసియేషన్ కార్యదర్శి రాబర్ట్, భవన నిర్మాణ కార్మిక నాయకులు రమేష్ లు పాల్గోన్నారు.



నాయకులు మాట్లాడు తు ట్రూ అప్ ఛార్జిలాభారాన్ని ప్రజలపై వేయద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రతి నెల విద్యుత్ వినియోగదారులపై భారం పడుతుందని ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువులధరలు తో ప్రజలు పడుతున్నారని ముక్యమంత్రి విద్యుత్ వినియోగదారులకు న్యాయం చేయాలని సదస్సు కోరింది. విద్యుత్ వినియోగదారుల సంక్షేమ సంఘము ఏర్పాటును సదస్సు ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గా న్యాయవాది చక్రవర్తి రెడ్డి, ప్రధాన కార్యదర్శి గా చైతన్య, ఉపాధ్యక్షులుగా సురేంద్రనాథ్, శ్రీనిసమూర్తి, ద్వారకనాథ్, అజమాతుల్లా, కార్యదర్శి లుగా మునస్వామి, రషీద్, భాస్కర్ రెడ్డి, రాబర్ట్ లు ఎన్నికయ్యారు. పి. చైతన్య ప్రధాన కార్యదర్శిలు పాల్గొన్నారు.

# కనీస వేతనం అమలు చేయాలని వినతి

**కాణిపాకం - సూర్య వాస్తవం:** చిత్తూరు జిల్లా ఐరాల మండలం కాణిపాకం దేవస్థానం నందు శనివారం ఉదయం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నాయకత్వం లో కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి గురు ప్రసాద్, ఏఈఓ రవీంద్ర ని కలిసి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్ .నాగరాజు మాట్లాడుతూ శ్రీ కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో కాంట్రాక్టు ,ఔట్ సోర్సింగ్ పద్ధతిని రద్దు చేసి కాణిపాకం దేవస్థానమే నిర్వహించాలని ప్రభుత్వాన్ని ,దేవదాయ శాఖ అధికారులను డిమాండ్ చేశారు. 25 సంవత్సరాలు గా కాణిపాకం దేవస్థానం లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ శానిటేషన్ సిబ్బంది అందరూ ఒకే పని చేస్తున్నప్పటికీ జీతాల్లో వ్యత్యాసం ఏమిటని అధికారులను సూటిగా ప్రశ్నించారు. కార్మికుల చట్టం ప్రకారం కనీస వేతనం అమలు చేయకపోవడం శోచనీయం అన్నారు. ఇప్పటికైనా కాణిపాకం దేవస్థానం ఈవో ప్రభుత్వంతో, దేవాదాయ శాఖ అధికారులతో చర్చించి కాణిపాకం దేవస్థానం లో 20,25 సంవత్సరాలు గా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ శానిటేషన్ సిబ్బందికి కనీస వేతనంతో పాటు ఈఎస్ఐ గుర్తింపు కార్డు యూనిఫారం మంజూరుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు సంగీతం గుర్రప్ప, పి రఘు, డి హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు వి.దామోదరం, కలవకుంట హరినాథ్ లు పాల్గొన్నారు. కాణిపాకం దేవస్థానం అసిస్టెంట్ ఈవో రవీంద్ర బాబు స్పందిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.



# ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**కర్నూల్ క్రైం - సూర్య వాస్తవం:** ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా మార్గదర్శకాలు, ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ అన్నారు.ఈ సంధర్భంగా శనివారం నాడు కర్నూలు కొత్తపేట దగ్గర ఉన్న ఆధునీకరించిన ట్రాఫిక్ పోలీసు స్టేషన్ లో ట్రాఫిక్ అవగాహన, కౌన్సిలింగ్ సెంటర్ ను జిల్లా ఎస్పీ ప్రారంభించారు.ఈ సంధర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ బిందు మాధవ్ మాట్లాడుతూ. కర్నూలు లో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు.ప్రమాదాలను తగ్గించేందుకు, ట్రాఫిక్ అంతరాయం లేకుండా సజావుగా సాగేందుకు ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతమైన డ్రైవింగ్ చేయాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఆటో డ్రైవర్లు తమ భద్రతకు, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆటో డ్రైవర్లందరూ తప్పనిసరిగా ఆటోల రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు.డ్రైవర్లు నిర్లక్ష్యపు డ్రైవింగ్, డ్రైవింగ్‌లో మొబైల్ ఫోన్లు ఉపయోగించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ఓవర్‌లోడింగ్ చేయడం వంటివి చేయకూడదన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఆటోలను నిర్ణీత ప్రాంతాల్లో మాత్రమే పార్కింగ్ చేయాలన్నారు.మైనర్లు వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు ఎక్కువ అవుతున్నాయన్నారు. ఎవరైతే లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే మైనర్ల తల్లిదండ్రులను పిలిపించి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ చేత ట్రాఫిక్ రూల్స్ గురించి లఘు చిత్రాల ద్వారా కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. కర్నూలు లో 5 వేలకు పైగా ఆటోలు ఉన్నాయన్నారు. ఎవరైనా ఒక వ్యక్తి ఆటో ఎక్కడానికి చేయి చాపడంతో ఆటో వాళ్ళు వెంటనే ముందు వెనక ఆలోచించకుండా ఆటోని అక్కడనే ఆపుతున్నారన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలుగుజేస్తూ, వెనుకవచ్చే వారికి ప్రమాదాలకు గురిచేయకూడదన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగనీయకుండా ఆటోలు నడపాలన్నారు. ప్రతి ఆటోకు పోలీసు గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, నేరాలను అరికట్టడంలో ప్రజల సహకారం ఎంతో ముఖ్యమన్నారు. ఎక్కడైనా అనుమానాస్పద కార్య కలాపాలు జరిగినా డయల్ 112 కు గాని, డయల్ 100 కు గాని పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు డిఎస్పీ జె.బాబు ప్రసాద్, ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్, కర్నూలు పట్టణ సిఐలు రామయ్యానాయుడు, నాగరాజా రావు, మురళీధర్ రెడ్డి, మధుసూధన గౌడ్, పవన్ కుమార్, ట్రాఫిక్ ఆర్ ఎస్సై హుస్సేన్, ఆటో యూనియన్ సంఘాలు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



# కోడుమూరులో ప్రజాపోరు

**కోడుమూరు - సూర్య వాస్తవం:** రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం తలపెట్టిన ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా కోడుమూరు పట్టణంలో శాంతినగర్ మాల వీధి పాత బస్టాండ్ సంత మార్కెట్ వీధుల్లో పాదయాత్ర నిర్వహించారు.సిపిఎం మండల కమిటీ సభ్యులు కే రాజు అధ్యక్షతన జరిగిన ఈ ప్రజా పోరు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేవీ నారాయణ హాజరై వీధి వీధి తిరిగారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలి. అందులో ఒక్క పెన్షన్ తప్ప ఏది అమలు చేయలేదు. గ్యాస్ సిలిండర్లు కూడా ఉచితమన్నారు చాలామందికి డబ్బులు పడలేదన్నారు అలాగే ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది.పిల్లలు చదువుతుంటే అంతమందికి 15 వేల రూపాయలు వేస్తామని చెప్పారు. ఇంతవరకు వేయలేదు రైతులకు రైతు భరోసా కింద రూ.20 రూపాయలు ఇస్తామని చెప్పారు అది కూడా అమలు చేయలేదు. ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో కరెంటు చార్జీలు విపరీతంగా పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారు. ఒకపక్క పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల వల్ల ఉపాధి లేక పేదలు అల్లాడుతుంటే ప్రభుత్వం నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించడంలో చాలా విఫలమైంది.18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు 1500 రూపాయలు ఇస్తామన్నారు. కనీసం దాని మాటే ఎత్తడం లేదు. ఈ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో చాలా నిర్లక్ష్యంగా ఉన్నది ప్రకృతి ప్రసాదించిన ఇసుకను ఉచితంగా ఇవ్వాల్సిన ప్రభుత్వాలు దానిని కూడా వ్యాపారంగా చూస్తున్నాయి. తామ అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక విధానం తెస్తామని చెప్పి నేటికీ అమలు చేయడంలో నిర్లక్ష్యం ఉన్నది ఉచితం పేరుతో చాలామంది దోపిడీ చేస్తున్నారన్నారు.




# యాదవ్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన వెంకటేష్

**పత్తికొండ - సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ యాదవ్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమించిన నరసింహ యాదవ్ ను శనివారం తెలుగుదేశం పార్టీ నాయకుడు మిద్దె వెంకటేష్ యాదవ్ కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా టిడిపి నేత మిద్దె వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేసిన నరసింహ యాదవ్ కు రాష్ట్ర యాదవ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు యాదవుల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. చైర్మన్ గా నియమితులైన నరసింహ యాదవ్ రాష్ట్రంలోనే అన్ని ప్రాంతాలలో పర్యటించి ఆర్థికంగా వెనుకబడిన యాదవుల అభివృద్ధికి కృషి చేయాలని కోరినట్లు మిద్దె వెంకటేష్ యాదవ్ తెలిపారు.



## ఆంధ్రప్రదేశ్ వన్నికుల క్షత్రియ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా సీఆర్ రాజన్



**చిత్తూరు - సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వన్నికుల క్షత్రియ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్గా సిఆర్ రాజన్ పేరును ప్రకటించిన కూటమి ప్రభుత్వం. ప్రస్తుతం చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడుగా విధులు నిర్వహిస్తున్నారు.

## బెల్ట్ షాపులు నిర్వహిస్తే అరెస్టులు

### - సీఐ శ్రీనివాసులు



**బంగారుపాలెం - సూర్య వాస్తవం:** చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం లో శనివారం రాబడిన సమాచారం మేరకు రాగిమానుపెంట గ్రామానికి చెందిన ఈశ్వరయ్య వయస్సు 46 సంవత్సరములు (తండ్రి) బాలకృష్ణ అను అతను గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నడనే సమాచారం మేరకు అతనిని అరెస్ట్ చేసి అతని వద్ద నుండి 33 మంజీరా క్వార్టర్ బాటిల్స్ 180 ఎంఎల్ ప్యాకెట్స్ స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు బంగారుపాలెం అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ సిఐ కత్తి. శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కిరణ్ కుమార్, మురళి, కానిస్టేబుళ్లు మోహన్ నాయుడు, రమేష్, యుగంధర్ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రికి స్వాగతం


### - ఏపీఎస్ఎస్‌డీసీఎల్ చైర్మన్ మన్నే సుబ్బారెడ్డి



**డోన్ - సూర్య వాస్తవం:** శనివారం రోజున విజయవాడ నుండి శ్రీశైలం వరకు సీ ప్లేన్ డెమో ను ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడ ప్రకాశం బ్యారేజి నండి శ్రీశైలం దేవస్థానం పాతాళాగంగ కు సీ ప్లేన్ లో విచ్చేసిన నారా చంద్రబాబు నాయుడు కి స్వాగతం పలికి, మర్యాదపూర్వకంగా కలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి . సీ ప్లేన్ డెమో కార్యక్రమంలో మంత్రులు, ఎం.పి, ఎమ్మెల్యేలు, సంబంధిత అధికారులు, టిడిపి నాయకులు హాజరయ్యారు.

## శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న మన్నే సుబ్బారెడ్డి

**డోన్ - సూర్య వాస్తవం:** శనివారం రోజున కర్నూలు జిల్లాల వెలసిన ప్రసిద్ధిగాంచిన శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీశైలం దేవస్థానం నందు శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జునస్వామి దర్శించుకొని, ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్న మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి



## బోరుగడ్డ అనిల్‌పై మరో కేసు నమోదు

### - పీటీ వారెంట్‌పై కర్నూలుకు బోరుగడ్డ అనిల్

**కర్నూలు - సూర్య వాస్తవం:** వైసిపి నేత బోరుగడ్డ అనిల్ ను పోలీసులు పీటీ వారెంట్ పై కర్నూలుకు తీసుకొచ్చారు. సోషల్ మీడియాలో సిఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందేఈ నేపథ్యంలో వైసిపి నేత బోరుగడ్డ అనిల్ పై గతంలో టిడిపి నేత గట్టు తిలక్ ఫిర్యాదు చేశారు. దీంతో కర్నూలు మూడో పట్టణ పోలీస్ స్టేషన్లో అనిల్పై మరో కేసు నమోదైంది.



## చూడ చైర్మన్‌గా కటారి హేమలత

**చిత్తూరు - సూర్య వాస్తవం:** చిత్తూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్గా కటారి హేమలతను ప్రకటించిన కూటమి ప్రభుత్వం. గతంలో చిత్తూరు మేయర్ గా విధులు నిర్వహించారు.



## మా స్థలంలో దౌర్జన్యంగా
# రోడ్డు వేయడం దూర్మార్గం




**చింతకొమ్మదిన్నె - సూర్య వాస్తవం:** మా పట్టా స్థలంలో మా అనుమతి లేకుండా దౌర్జన్యంగా ఇరగం రెడ్డి చంద్ర రెడ్డి, రామసుబ్బారెడ్డి లు రోడ్డు వేయడం చాలా దూర్మార్గమని మాజీ సర్పంచ్ ఇరగం రెడ్డి గంగాసదేవి, లక్ష్మి రెడ్డి లు వాపోయారు. శనివారం ఈ సందర్భంగా వారు మీడియా తో మాట్లాడుతూ పెండ్లిమర్రి మండలం, వెల్లటూరు గ్రామం లో సర్వేనెంబర్ 191/3 లో 33 సెంట్లు గల మా సొంత స్థలంలో రోడ్డు ను వేయడం చాలా దుర్మార్గమని వాపోయారు. రోడ్డు వేసేటప్పుడు అంత వేసుకుంటూ వస్తూ మా స్థలంలో కూడా వేయాలని తెలిపారు. ఆలా కాకుండా ఎక్కడ వేయకుండా మా స్థలంలో వేయడం చాలా దుర్మార్గమన్నారు.మా స్థలంలో దౌర్జన్యంగా రోడ్డు వేయడానికి అధికారులు, పోలీసుల అండదండలతో ఇర్గం రెడ్డి చంద్రారెడ్డి, ఇరుగంరెడ్డి రామ సుబ్బారెడ్డి లు కలసి దౌర్జన్యం చేసి మా స్థలంలో రోడ్డు వేడం చాలా దుర్మార్గమన్నారు. కావున దయచేసి పై అధికారులు మాపై దౌర్జన్యం చేసినవారిపై చర్యలు తీసికొని మాకు న్యాయం చేయుదురని కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమం లో ఇర్గం రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఇరుగం రెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఇర్గం రెడ్డి రవి శేఖర్ రెడ్డి, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో రైతులకు తీవ్ర గాయాలు




**మదనపల్లె క్రైమ్ - సూర్య వాస్తవం:** రోడ్డు ప్రమాదంలో రైతులు తీవ్రంగా గాయపడినట్లు తంబళ్లపల్లి ఎస్సై లోకేష్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా, పీలేరు నియోజకవర్గం లోని నగిరిమడుగు చెందిన రైతులు నగరిమడుగు వెంకటరమణ 58, అదే ఊరి చెందిన మరో రైతు కాంతారపు రెడ్డప్ప(56) సొంత పనిపై తంబళ్లపల్లె మండలం, గోపిదిన్నె కు శనివారం ఉదయం బైకులో వెళుతుండగా మార్గ మధ్యంలోని గోపిదిన్నె క్రాస్ వద్ద ఆటో వేగంగా వచ్చి బైక్ ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు రైతులు తీవ్రంగా గాయపడి రోడ్డుపై పడి ఉండగా, స్థానికులు గుర్తించి కురబలకోట 108 కు సమాచారం అందించారు. స్పందించిన సిబ్బంది మనోహర్, రఫీ క్షతగాత్రులను చికిత్సల నిమిత్తం హుటాహుటిన మదనపల్లి జిల్లా ప్రభుత్వా సుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం వారిలో నగిరి మడుగు రెడ్డప్ప పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో, ప్రథమ చికిత్సల అనంతరం వారిని తిరుపతి రుయా ఆసుపత్రికి డాక్టర్ల సలహా మేరకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డీయంహెచ్‌వో



**చింతకొమ్మదిన్నె - సూర్య వాస్తవం:** వైద్య ఆరోగ్య శాఖ కార్యక్రమాల పర్యవేక్షణలో భాగంగా శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.నాగరాజుగారు చింతకొమ్మదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనికీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వివిధ రికార్డులను తనికిచేసి అక్కడ అందచేయ బడుతున్న సేవలపై సంతృప్తిని వెలిబుచ్చడం జరిగింది. అక్కడ రక్తపరీక్షలు విభాగాన్ని ఫార్మసీ విభాగాన్ని సందర్శించి సూచనలు సలహాలు వెలిబుచ్చడం జరిగింది. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నూతనంగా నిర్మిత మవుతున్న కేంద్రీకృత రక్తపరీక్షల భవనాన్ని పరిశీలించడం జరిగింది. ఈ రోజు ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ప్రధాన్ మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని పరిశీలించి గర్భవతులకు అందచేస్తున్న సేవలపై సంతృప్తిని వ్యక్తంచేస్తూ కార్యక్రమాలను విజయవంతంచేస్తున్న స్థానిక వైద్యులు డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ సునీతలను, సిబ్బందిని అభినందించడం జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ హర్షిత, సమాజ ఆరోగ్య అధికారి శ్రీ సుకుమారన్ఆ రోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## మగ్గానికే ఉరివేసుకున్న చేనేత కార్మికుడు



**మదనపల్లె క్రైమ్ - సూర్య వాస్తవం:** మదనపల్లె లోని నీరుగట్టు వారిపల్లెలో చేనేత మగ్గానికే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుని మృతి కన్నీళ్లను తెప్పిస్తోంది. శనివారం తీవ్ర కలకలం రేపిన ఘటనపై వివరాలు.. సత్యసాయి జిల్లా, సోమందేపల్లికి చెందిన రామయ్య కొడుకు చేనేత కార్మికుడు సి. హరి(45) మదనపల్లె పట్టణం, నీరుగట్టు వారిపల్లిలోని మారుతి నగర్లో ఉంటున్నాడు. అనారోగ్యం కారణంగా తాను నేచే మగ్గానికే ఉరివేసుకుని బలవన్మరణం చెందాడు. సంఘటన స్థలాన్ని మదనపల్లె ఒకటవ పట్టణ సీఐ చాంద్ భాషా పరిశీలించి, సత్యసాయి జిల్లాలో ఉన్న మృతుని భార్య హేమావతి, పిల్లలు చరణ్, వరుణ్ లకు సమాచారం అందించారు. భార్య అలిగి పుట్టినింటిలో ఉండడం వల్లనే మనస్థాపం చెంది హరి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉండివచ్చని, కేసు దర్యాప్తులో వాస్తవాలు వెలుగులోకి వస్తాయని సీఐ తెలిపారు. కాగా ఆత్మహత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

# అంతా డైవర్షన్ పాలిటిక్స్




**రాయచోటి - సూర్య వాస్తవం:** కూటమి ప్రభుత్వం సోషియల్ మీడియా కార్యకర్తలపై ధ్వంద వైఖరి పాలసీ పాటిస్తోందని తప్పు చేసిన వారు ఏ పార్టీ వారైనా సరే కఠినంగా శిక్షించాలని, మహిళలపై అసభ్యకరంగా పోస్టింగ్లు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి, వైఎస్ఆర్ సిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ రెడ్డి, మదనపల్లె ఇంచార్జి నిస్సార్ అహమ్మద్ లు పేర్కొన్నారు. శనివారం ఈమేరకు రాయచోటి లోని జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లి అసభ్య కర పోస్టులు పెడితున్న టిడిపి సోషియల్ మీడియాపై డీఎస్పీకి వారు ఫిర్యాదు చేశారు. మీడియా సమావేశంలో గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ కుటుంబ సభ్యులపైన ఎంత దారుణమైన పోస్టింగ్లు పెట్టారో అందరూ చూస్తున్నారన్నారు. కానీ కేవలం టీడీపీ వారిపైనే పోస్టింగ్లు పెట్టారని, వారిని వెంటాడి కేసులు పెట్టడం బాధాకరమన్నారు. గతంలో వైఎస్సార్ కుటుంబ సభ్యులపై కూడా అభ్యకరమైన పోస్టింగ్స్ పెట్టారని, వారిపై ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. తమ నాయకుడు మహిళలను దూషించ రాదని గౌరవించా లని సూచించా రన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తప్పు చేసిన వారిపైన మాత్రమే కేసులు పెట్టాలని, ఏ తప్పూ చేయక, ఎటువంటి సంబంధం లేని వైఎస్సార్సీపీ కార్యకర్తలపై మాత్రమే కేసులు పెడితే ఉపేక్షించమన్నారు. తమ కార్యకర్తలను రక్షించు కోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని, వారికి పూర్తిగా మద్దతుగా నిలుస్తామన్నారు. అప్పుడు ఎంతమందిని అరెస్టుచేస్తారో. ఎంత మందిని జైళ్లలో పెడతారో చూస్తామని ఆయన ఘాటుగా విమర్శించారు. ఆకేపాటి అమర్నాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని, వాటిని ఎత్తి చూపిస్తే కూటమి ప్రభుత్వం మహిళలను కించపరచారంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆరోపించారు. అయితే మహిళలపై ఎవరు అసభ్యకరమైన పోస్టింగ్లు పెట్టినా, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే టీడీపీకి చెందిన మహిళలే మహిళలు అయినట్లుగా వైఎస్సార్ సీపీ మహిళలు మహిళలు కాదనట్లుగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోం దన్నారు. ఇలాంటి పోస్టింగ్స్ పెట్టారో, వారందరపై కేసులు నమోదు చేయాలని కోరారు. నిస్సార్అహమ్మద్ మాట్లాడుతూ గతంలో బ్రిటీష్ ప్రభుత్వానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వాని తేడా లేదని ఆరోపించారు. బ్రిటీష్ వారు ప్రజలను హింసించే వారని, తరిమికొట్టడానికి ప్రజలందరూ ఏకమై, పోరిపోయేలా పోరాటం సాగించారని చెప్పారు. అలాంటి పరిస్థితే టీడీపీకి పడుతుందన్నారు. పరిపాలన చేయడం చేత కాక ఇలా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి, వాటిని అమలు చేయలేదని, తాము వారి కర్తవ్యాన్ని గుర్తు చేస్తుంటే కేసులు పెట్టడం విచాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వైస్ చైర్మన్ ఫయాజూర్ రహిమాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొలిమి హారూన్ బాష, బిసి సెల్ విజయభాస్కర్, జానం రవీంద్ర యాదవ్, అన్నా సలీం, అబుజర్ పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు



**చెన్నూరు - సూర్య వాస్తవం:** మండల వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు విస్తృతంగా చేపట్టడంజరిగింది.మండలంలోని రామన పల్లి, గ్రామపంచాయతీలో శుక్రవారం, శనివారం మాజీ అటవీశాఖ డైరెక్టర్ తెలుగుదేశం పార్టీ నాయకురాలు రామన శ్రీలక్ష్మి, అలాగే తెలుగుదేశం పార్టీ నాయకులు ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొని సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈసందర్భంగా తెలుగుదేశం పార్టీ రామన శ్రీలక్ష్మి మాట్లాడుతూ కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, ఆదేశాల మేరకు రామనపల్లె గ్రామపంచాయతీ వ్యాప్తంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టడం జరిగిందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్ 4 వేల రూపాయలు పెంపు అదేవిధంగా మహిళలకు సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ లు తోపాటు సూపర్ సిక్స్ పథకాలను అమలు పరచడం జరుగుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ అనుసరిస్తున్న విధానాలకు ఆకర్షితులైన ప్రజలు భారీ ఎత్తున తెలుగుదేశంపార్టీ సభ్యత్వం తీసుకోవడం జరుగుతుందన్నారు. పార్టీ సభ్యత్వ నమోదును మండల వ్యాప్తంగా అనుకున్న దానికన్నా ఎక్కువ చేసే విధంగా అటు టిడిపి నాయకులు కార్యకర్తలతో కలిసి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రామన చంద్రమోహన్ రెడ్డి, పుత్త మహేంద్రారెడ్డి, ఐటిడిపి ఛాంపియన్ యామాల మణికంఠ, ముగినారు సదాశివరెడ్డి, బండి శీను,పూసపాటి మణికంఠ రాజు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తే చర్యలు




**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం:** డాబాలు, రెస్టారెంట్లలో మద్యం సేవించడానికి అనుమతించినా, అక్రమంగా మద్యం విక్రయాలు కొనసాగించినా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ తెలిపారు.జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో డాబాలు, రెస్టారెంట్ల యజమానులకు పలు సూచనలు జారీ చేశారు. జిల్లాలోని 5 పోలీసు సబ్ డివిజన్ల పరిధుల్లోను డీఎస్పీలు, సి.ఐ ల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం... దిశానిర్దేశం చేశారు. మద్యం సేవించి డ్రైవ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే వీలున్నందున డాబాలు, రెస్టారెంట్లలో మద్యపానానికి అనుమతి ఇవ్వకండనీ తెలిపారు.మద్యం తాగిన మత్తులో కొందరు నేరాలకు ఒడిగట్టడం. మహిళా ప్రయాణీకుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, ఈవ్ టీజింగ్ పాల్పడటం వీలున్నందున ఎట్టి పరిస్థితులలో డాబాలు, రెస్టారెంట్లలో మద్యపానానికి అనుమతి ఉండకూడదన్నారు. డాబాలు, రెస్టారెంట్లలో మైనర్ బాలులతో పని చేయించడం, పనిలో ఉంచుకోవడం చట్ట విరుద్ధం. ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని ప్రతీ డాబా, రెస్టారెంట్ వద్ద ఇక్కడ మద్యపానం నిషేధం. ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు అంటూ ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేయాలనీ కోరారు.

# ఇసుక టిప్పర్లతో ప్రజలు ఇబ్బందులు



**కనేకల - సూర్య వాస్తవం:** కనేకల్ మండల పరిధిలోని రచ్చుమరి ఇసుక రీచ్ నుండి టిప్పర్లు ఇసుక తీసుకెళ్తాయి ప్రతి టిప్పర్ ఆదిగానపల్లి గ్రామం మీదుగా వెళ్లడంతో రోడ్డు పక్కన ఉండే ఇల్లు దుమ్ము దులితో మునిగిపోతున్నాయి రాత్రి వేళల్లో శబ్దాలకు నిద్ర లేకుండా ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు దుమ్ము ధూళి శబ్దాల వలన అనారోగ్యం పాలు అవుతున్నారు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుకను తీసుకెళ్లడానికి పర్మిషన్ ఉంది కాకపోతే రాత్రి 12 అయిన ఇసుకను తీసుకెళ్లడంతో ఆదిగానపల్లి కొత్తపల్లి గ్రామ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు పగటిపూట దుమ్ము దూళి ఇళ్లల్లోకి రావడంతో చిన్న పిల్లలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు గ్రామ ప్రజలు అందరూ అధికారులకు తెలియపరిచిన పట్టించుకోవడం లేదంటూ బాధపడుతున్నారు రెవెన్యూ అధికారులు మైనింగ్ అధికారులు అందరూ రెండు రోజులు మా ఊర్లో వచ్చి ఉండండి మా పరిస్థితి ఏంటో మీకు తెలుస్తుంది అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు వీలైనంత త్వరగా రెవెన్యూ అధికారులు మైనింగ్ అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోని మాకు దుమ్ము దూళి లేకుండా శబ్దాలు లేకుండా చూడాలని అధికారులను గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు.

# వేమన సుమతీ శతక పద్యాలాపన పోటీలు



**మైదుకూరు – సూర్య వాస్తవం:** ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల బాలాజీ నగర్ కడప. పిల్లల సామాజిక అభివృద్ధికి తోడ్పాటు 2024 నవంబర్ 14వ తేదీన బాలల దినోత్సవం పురస్కరించుకొని కడప బాలోత్సవ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు భాష నైపుణ్యాలను పెంపొందించడానికి నేటి సమాజంలో నెలకొన్న సమస్యలపై విద్యార్థులలో అవగాహన కల్పించడానికి పద్య పఠన, వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు కడప బాలోత్సవ కమిటీ అధ్యక్షులు జి గోపాల్ తెలియజేశారు శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు కడపలోని ఎస్ వి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ పోటీలు నిర్వహించారు ఈ సందర్భంగా అధ్యక్షులు ఈ గోపాల్ మాట్లాడుతూ 6 7 8 తరగతుల విద్యార్థులకు 'ట్రాఫిక్ సమస్యలు – పరిష్కారాలు – అనే అంశంపై వ్యాసరచన పోటీ వేమన, సుమతీ శతకాలలోని పద్యాలాపన నిర్వహించామని అన్నారు. ఇందులో జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల నుండి విద్యార్థిని విద్యార్థులు జూనియర్ విభాగం నుండి వ్యాసరచనకి 180 మంది పద్యాలాపన 225 మంది పాల్గొన్నారు మధ్యాహ్నం 9 10 తరగతుల సీనియర్ విద్యార్థులకు మత్తు పదార్థాలు– యువతపై ప్రభావం– వాటి నివారణ అంశంపై వ్యాసరచన పోటీ అలాగే నాటక రంగ పద్యాల పై పోటీలు విడివిడిగా నిర్వహించడం జరిగింది. బాలోత్సవం ఉపాధ్యక్షులు ఉండేల నాగ ముని రెడ్డి, బాల ఎల్లారెడ్డి మాట్లాడుతూ వ్యాసరచన పద్యాలాపన పోటీలలో ఇంత మంది విద్యార్థులు పాల్గొనడం ఆనందంగా ఉందని వీరిని భాగస్వామ్యం చేసిన పాఠశాల యాజ మాన్యాలకు, అధ్యాపకులకు, తల్లిదండ్రులకు, అభినందనలు తెలియజేశారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని గురించి వైయస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా విద్యా– విజ్ఞానం– నైపుణ్యం అనే అంశాలను ప్రధానం చేసుకొని కడప బాలోత్సవం పేరుతో ఎంతోమంది విద్యార్థిని విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దు తుందన్నారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్నేతలు గా వ్యవహరించిన వైవియు అధ్యాపక బృందానికి, రచయితలకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమ నిర్వహణ ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీర సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు లక్ష్మీరాజా, షామీర్, సుందరయ్య, వెంకటసుబ్బయ్య, దేవదత్త, వెంకటేశ్వర్లు, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరరావు, డాక్టర్ పోదిలి నాగరాజు, డాక్టర్ రెడ్డి శేఖర్, డాక్టర్ స్వతంత్ర బాబు, భూమి రెడ్డి స్వరూప రాణి, మోపూరి భైరవేశ్వర్, తన కంటి సందీప్, బండి పరిమళ జ్యోతి, రామచంద్రయ్యలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. జన విజ్ఞాన వేదిక నాయకులు శివరాం,సునీత,అరుణ,శ్రీనివాసులు పాల్గొన్నారు.

# అన్నమయ్య జిల్లాలో సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలి

**- బీజేపీ రాయచోటి అసెంబ్లీ కన్వీనర్ కె.నిర్మల్ కుమార్**




**రాయచోటి – సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లాలో సంస్థాగతంగా భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయాలని బిజెపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్ పిలుపునిచ్చారు. శనివారం రాయచోటి పట్టణంలోని మాసాపేటలో గల సాయిశుభ కళ్యాణ మండపంలో బిజెపి రాయచోటి అసెంబ్లీ కన్వీనర్ కే నిర్మల్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి లోకేష్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ జిల్లా వ్యాప్తంగా రోజు రోజుకు బలోపేతం అవుతోందన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలు, గ్రామస్థాయి నుండి సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కేంద్రం సహకారంతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు గురించి ప్రజలకు అవగాహన కల్పించి పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. పార్టీలో కష్టపడే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. రాబోవు రోజుల్లో అన్నమయ్య జిల్లాలో భారతీయ జనతా పార్టీ మరింత బలోపేతం కావాలంటే నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఐక్యంగా కృషి చేయాలన్నారు. అనంతరం బిజెపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఒక రాయలసీమ ప్రాంత వాసిగా ఉంటూ అసెంబ్లీకి వెళ్ళను అని చెప్పడం సిగ్గుచేటన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత వైఎస్ జగన్ కు ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందంటూ వైసీపీ నాయకులు గగ్గోలు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో వైసిపి సోషల్ మీడియా ప్రతినిధులు బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తో పాటు ఇతర బిజెపి నేతలు పైన ఎన్నో రకాల అసభ్యకర పోస్ట్ లు పెట్టడం వైసిపి నేతలు మరిచిపోయారా అని ఆయన ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందన్నారు. ప్రతి నాయకుడు కార్యకర్త అభిమానులు నిరంతరం పార్టీ కోసం కష్టపడుతూ భవిష్యత్తులో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి బ్రహ్మం,జిల్లా ఇన్చార్జి చంద్రమౌళి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్ నాయుడు, ఎన్నికల సహాయ అధికారి పులి నరేందర్ రెడ్డి, ఎన్నికల సహా రిటర్నింగ్ అధికారి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ గజపతిరాజు, రాయచోటి ఇంచార్జ్, కో కన్వీనర్ నిర్మల్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ పాలగిరి శ్రీనివాస కుమార్ రాజు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

**- డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ హేమలత**
**- డాక్టర్ షేక్ రోషిణి, డాక్టర్ యశశ్విని**





**దువ్వూరు – సూర్య వాస్తవం:** గర్భిణీ స్త్రీలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ షేక్ రోషిణి, డాక్టర్ హేమలత, డాక్టర్ యశశ్విని లు పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పని సరిగా పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం మంచిదన్నారు. వైద్య సిబ్బంది సూచించే నియమాలను తప్పకుండా పాటించాలని వారు సూచించారు. ముఖ్యంగా హిమోగ్లోబిన్, బీపీ, షుగర్, వంటి పరీక్షలను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చూపించుకోవాలని వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సదుపాయాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు జరిగేలా చూడాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 33 మంది గర్భవతులు రావడం జరిగింది. గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. గర్భవతులందరి మహిళా డాక్టర్లు వైద్య పరీక్షలు జరిపి తగిన సూచనలు సలహాలను ఇస్తూ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ విజయ కుమారి, సూపర్వైజర్ మేరీ సువర్ణ, సచివాలయ సిహెచ్ఓలు బి.శ్రావణి, పి. సౌభాగ్య లక్ష్మి, టి.ప్రభ, వై.శ్యామల, వై.సుధ, హారతి, హరిచందన, పూజ, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టు శిఖరం నేలకు ఒరిగింది



**చింతకొమ్మదిన్నె – సూర్య వాస్తవం:** అత్యంత ధనవంతుల కుటుంబంలో పుట్టి, ఎంతో చరిత్ర ఉన్న విజయవాడ లయోలా కాలేజీలో చదువుకొని 60 సంవత్సరాల పాటు కమ్యూనిస్టు ఉద్యమానికి అంకితమై, పేదల కోసం, కార్మికుల కోసం ఆయన చివరి శ్వాస వరకు అలుపెరగని పోరాటలు నిర్వహించిన కమ్యూనిస్టు శిఖరం లింగమూర్తి శనివారం కన్నుమూశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయన పార్థివ దేహం వద్ద నివాళులు అర్పించారు. ప్రస్తుత, భవిష్యత్తు తరాల వారికి ఎందరికో ఆదర్శప్రాయుడని, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, పుత్త నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తులసి రెడ్డి, అఫ్జల్ ఖాన్, వైసిపి మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ భాష, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, ఎల్ఐసి రఘునాథ్ రెడ్డి, సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు గాలి చంద్ర, చంద్రశేఖర్లు, ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి లు అన్నారు. శనివారం లింగమూర్తి పార్థివ దేహానికి తన స్వగృహమందు కుటుంబ సభ్యులను ఓదార్చి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, లింగమూర్తి చదువుకున్న రోజుల నుంచే నాయకత్వ లక్షణాలు కలిగి ఉండేవారని, అందుచేతనే పేద ప్రజల కష్టాలను, సమస్యలను దగ్గరగా చూసిన ఆయన కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యాడని, ధనవంతుల కుటుంబంలో పుట్టినప్పటికీ పేదలతో కలిసి జీవించారని, వారు వివరించారు. రాయలసీమ వ్యాప్తంగా రైతు వ్యవసాయ కార్మిక సంఘాల బలోపేతానికి, వ్యవసాయ రంగంలో అభివృద్ధి కోసం, తాగు, సాగునీటి ప్రాజెక్టుల, కాలువల ఏర్పాట్ల కోసం, అహర్నిశలు ఉద్యమించిన 84 ఏళ్ల యువకుడు లింగమూర్తి అని వారు తెలిపారు.

# సిద్దవటం రేంజ్‌లోని బీట్‌లో కూంబింగ్

**- బద్వేల్ సబ్ డీఎఫ్‌వో స్వామి వివేకానంద**



**సిద్దవటం – సూర్యవాస్తవం:** ఎర్ర చందనం పరిరక్షణకు సిబ్బంది చర్యలు చేపట్టాలని బద్వేల్ సబ్ డిఎఫ్ఓ బి స్వామి వివేకానంద సూచించారు. సిద్ధవటం రేంజ్ లోని రోళ్ళబోడు బేస్ క్యాంపును శనివారం బద్వేల్ సబ్ డిఎఫ్ఓ బి స్వామి వివేకానంద ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గొల్లపల్లి సెక్షన్ సిబ్బందితో కలిసి రోళ్ళబోడు, గొల్లపల్లి, సిద్ధవటం బీట్ల నందు ఎర్రచందనం స్మగ్లర్ల ఆచూకీ కోసం కూంబింగ్ నిర్వహించారు. అనంతరం ఆయన సిబ్బందికి ఎర్రచందనం పరిరక్షణకై పలు సూచనలు చేశారు. ప్రపంచంలోనే అత్యంత అరుదైన ఎర్ర చందనం ఇతర ప్రాంతాలకు తరల కుండా ఉండేందుకు స్థానికులు అటవీ అధికారులకు సహకరించాలన్నారు. ఈ కూంబింగ్ లో సిద్ధవటం రేంజర్ కళావతి, డిప్యూటీ రేంజర్ ఓబులేసు, ఫారెస్ట్ బీటు అధికారులు పెంచల్ రెడ్డి, ఆది విశ్వనాథ్, మధు, రోళ్ళబొడు, సిద్ధవటం బేస్ క్యాంపు సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## గుడిపాడు శ్రీ శంకరాచార్య హైస్కూల్‌లో జిల్లాస్థాయి లగోరి సెలక్షన్స్ పోటీలు



**దువ్వూరు – సూర్య వాస్తవం:** మండలంలోని గుడిపాడు గ్రామంలో శ్రీ శంకరాచార్య హై స్కూల్‌లో శనివారం జిల్లాస్థాయి లగోరి సెలక్షన్స్ నిర్వహించడం జరిగిందని శ్రీ శంకరాచార్య హై స్కూల్ కరస్పాండెంట్ మోలే రామ్మోహన్ రెడ్డి తెలిపారు. జిల్లా స్థాయి సెలక్షన్స్ ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బద్వేలి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు పది పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా మధ్యాహ్నం వరకు సెలక్షన్స్ జరిగాయి. ఈ సెలక్షన్స్ కార్యక్రమాన్ని కడప జిల్లా లగోరి సెక్రటరీ ఈర్ల సంజీవ రాయుడు పర్యవేక్షణలో వనిపెంట జడ్పీ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు మూడే రామ్ నాయక్ రిఫరీగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొనగా వారందరికీ శ్రీ శంకరాచార్య హై స్కూల్ యాజమాన్యం ఏర్పాట్లు చేయడం జరిగింది. ముగింపు సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మూలే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం బహుమతుల కోసమే కాకుండా జీవితాంతం ఏదో ఒక ఆటను కొనసాగిస్తే అనేక వ్యాధులకు దూరంగా ఉంటూ శారీరక దృఢత్వాన్ని పొందుతారని తద్వారా ప్రస్తుత తరుణంలో విరివిగా చూస్తున్న గుండె జబ్బులు తదితర సమస్యల నుంచి గట్టు ఎక్కవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, అతిథులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ శంకరాచార్య పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కడప సెంట్రల్ జైల్లో ఉన్న వారిని పరామర్శించిన రెడ్యం



**మైదుకూరు – సూర్య వాస్తవం:** కడప సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న మైదుకూరు మండలం, పెద్ద శెట్టి పల్లెకు చెందిన వైఎస్సార్ సిపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నేట్లపల్లి శివరాం, వైఎస్సార్ సిపీ మండల నేత నేట్లపల్లె రామాంజనేయులును వైఎస్సార్ సిపీ నేత,ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, వారి సతీమణులు, సమీప బంధువులతో కలిసి శనివారం పరామర్శించారు. మాకు ఎలాంటి సంబంధం లేని కేసుల్లో మమ్మలను అక్రమంగా తెదేపా నేతలు ఇరికించి మమ్మలను ఇబ్బందుల పాలు చేశారని నేట్లపల్లె శివరాం, రామాంజనేయులు రెడ్యం దృష్టికి తెగా మీకు నేను, నాతోపాటు వైఎస్సార్ సిపీ, వైసిపీ నేతలంతా ఉన్నారని మీరు ధైర్యంగా ఉండాలని రెడ్యం వారికి చెప్పారు. శివరాం, రామాంజనేయులను పరామర్శించిన వారిలో శివరాం భార్య నేట్లపల్లె గీత సౌజన్య, రామాంజనేయులు భార్య నేట్లపల్లి భాగ్య జ్యోతి, బావ అక్క వైసిపీ కమలాపురం నియోజకవర్గ బి.సి సెల్ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ఆదిమూలం వెంకట శివయ్య యాదవ్, శ్రీమతి ఆదిమూలం రామ తులసి, వైసిపీ ఖాజీపేట మండల నేత మల్లె ఓబయ్య యాదవ్ లు ఉన్నారు.

## జాఫరుద్దీన్‌కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



**రాయచోటి – సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణానికి చెందిన జీవ శాస్త్ర ఉపాధ్యాయుడు షేక్ జాఫరుద్దిన్ విద్యారం గంలో ఆయన చేసిన సేవలను గుర్తించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమి ప్రతి ఏటా ఇచ్చే అవార్డు 2024 సంవత్సరానికి గాను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎన్నికైనారు. నవంబరు 11 న విజయవాడలో జరిగే జాతీయ మైనారిటీ దినోత్సవం నందు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు గారి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. జాఫర్ ఉద్దీన్ ప్రస్తుతం రామాపురం మండలం పరిధిలోని నీలకంఠరావు పేట ఉర్దూ హైస్కూల్ నందు జీవ శాస్త్ర ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నారు. ఉపాధ్యాయునిగా ఆయన అందించిన సేవలు, ఆజాద్ ఎడ్యుకేషనల్, మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా చేసిన సామాజిక సేవలు, ఉర్దూ కవిగా, గాయకుడు గా ఉర్దూ భాషకు చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డు కు ఎంపిక చేశారని నిర్వాహకులు తెలిపారు. జాఫర్ ఉద్దీన్ కు రాష్ట్రస్థాయి అవార్డు రావడంతో పలువు స్థానికుల ఉర్దూ ఉపాధ్యాయులు కౌలు కళాకారులతో పాటు ఆజాద్ ఎడ్యుకేషనల్, మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్, అధ్యక్ష కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు.

# మందు బాబులకు అడ్డాగా జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణం



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం:** అనంతపురం పట్టణంలోని జూనియర్ కళాశాల ఆట స్థలం మందుబాబులకు అడ్డాగా మారింది. రాత్రి అయితే చాలు అనంతపురం జూనియర్ కళాశాల మైదానంలో మందు బాబులు చిందులేస్తున్నారు. రాత్రి అయితే చాలు మందు బాటిళ్లు, సోడా, స్టఫ్‌ను జూనియర్ కాలేజీలోనీ మైదానంలోకి తీసుకొచ్చి ఎంజాయ్ చేస్తున్నారు. మైదానానికి రాత్రుల్లో సరైన పర్యవేక్షణ లేనందున దీంతో రాత్రుళ్లు మందుబాబులు లోపలికి చొరబడి మైదానం ఆవరణ లో కూర్చొని మద్యం సేవిస్తున్నారు. హాస్టల్ ఉండడంతో రాత్రుళ్లు మం దుబాబులు రావటంతో హాస్టల్‌లో ఉండే విద్యార్థులు భయందోళన చెందుతున్నారు. పూటుగా మద్యం సేవించి మద్యం మత్తులో మందుబాబులు గొడవలకు దిగుతున్నారని వాకర్స్ వాపోతున్నారు. ఇప్పటికైనా జూనియర్ కళాశాల ఉన్నతాధికారులు, పోలీసు స్పందించి ఏదైనా సంఘటన జరగక ముందే రాత్రుల్లో మందు బాబులు ఎవరూ లోపలికి రాకుండా చర్యలు చేపట్టాలని వాకర్స్ కోరుతున్నారు.

## గోవులు తరలిస్తున్న లారీ పట్టివేత



**పామిడి - సూర్య వాస్తవం:** స్థానిక జాతీయ రహదారిపై డోన్ నుంచి కేరళ కు శనివారం నాడు గోవులను తరలిస్తున్న కంటైనర్‌ను సమాచారం అందిన వెంటనే పెద్దవడుగూరు పోలీస్ అధికారులు పట్టుకొని స్టేషన్కు తరలించారు. సమాచారం తెలుసుకున్న బిజెపి జిల్లా నాయకుడు రైజింగ్ రాజ పెద్దవడుగూరు పోలీస్ స్టేషన్ కు చేరుకొని అక్కడి పరిస్థితులను సమీక్షించారు.

## అంతర్రాష్ట్ర బైకుల దొంగ అరెస్టు

**- 24 బైకులు స్వాధీనం**

**- గార్లదిన్నె పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ జగదీష్**



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం:** అంధ్ర, కర్నాటక ప్రాంతాలలో బైకులు దొంగతనం చేసిన అంతర్రాష్ట్ర బైకుల దొంగను జిల్లాలోని గార్లదిన్నె పోలీసులు అరెస్టు చేశారు. ఇతను చోరీ చేసిన 24 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 15 లక్షలు ఉంటుంది. గార్లదిన్నె మండలం సంజీవపురం గ్రామానికి చెందిన శంకర్ సాయి జల్సాలకు అలవాటుపడ్డాడు. జల్సాలు తీర్చుకునే క్రమంలో బైకుల దొంగగా మారాడు. నకిలీ తాళాల సహాయంతో పార్క్ చేసిన బైకులను సులువుగా ఎత్తుకెళ్లడం ఇతనికి అలవాటయ్యింది. ఇలా... అనంతపురము, గార్లదిన్నె, నార్పల, శింగనమల, నంద్యాల, దర్మవరం, ఆదోని, బాగేపల్లి, తదితర ప్రాంతాలలో బైక్ లను దొంగతనాలు చేశాడు. వీటిని కర్నాటకలోని బెంగుళూరు లేదా బళ్లారిలలో అమ్మాలని ఓ రేకుల షెడ్డులో ఉంచిన సమాచారాన్ని రాబట్టుకుని అనంతపురం రూరల్ డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో శింగనమల సి.ఐ కౌలుట్లయ్య, గార్లదిన్నె ఎస్సై గౌస్ మహమ్మద్ బాషా ఆధ్వర్యంలో సిబ్బంది ఇతనిని అరెస్టు చేసి 24 బైకులను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్.. పోలీసు బృందాన్ని అభినందించారు.

## మైనార్టీలకు నామినేటెడ్ పదవి దక్కడంపై హర్షం

**- వ్యక్తం చేసిన టిడిపి యువ నాయకులు దాదు**



**అనంతపురం - సూర్య వాస్తవం:** మొహమ్మద్ అహ్మద్ షరీఫ్ ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ శాఖ సలహాదారుగా కేబినెట్ హెూదాలో నియమించినందుకు అలాగే ముస్తాక్ అహ్మద్ ను ఏపీ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ గ నియమించినందుకు అనంతపురం తెలుగుదేశం పార్టీ నాయకులు అనంతపురం నగర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి దాదు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ కు శనివారం నాడు కృతజ్ఞతలు తెలిపారు.

## నూతన దంపతులను ఆశీర్వదించిన అనిల్ గౌడ్



**పామిడి - సూర్య వాస్తవం:** గుంతకల్లు మండలం నరసాపురం గ్రామ వాస్తవ్యులు సీనియర్ టీడీపీ నాయకులు అరవ నాగేష్ పిలుపుమేరకు ఆయన కూతురు వివాహ రిసెప్షన్ కార్యక్రమనికి యువ నాయకులు అనిల్ గౌడ్ హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి శు భాకాంక్షలు తెలియజేయడం జరిగింది ఈ వివాహ మహెూత్సవంలో నరసాపురం గ్రామం టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తప్పు చేస్తే పోలీసులనూ వదలిపెట్టం

- శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న హెచ్చరిక
- అసాంఘిక శక్తులతో చేతులు కలిపినా, ప్రోత్స హించినా క్షమించేది లేదు
- హిందూపురం ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలకు కళ్లెం
- జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం:** పోలీసులు విధి నిర్వహణలో ఏ చిన్న తప్పు చేసినా వదిలేపెట్టేది లేదని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న హెచ్చరించారు. విధి నిర్వహణలో నీతి, నిజాయతీ, నిబద్ధతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. హిందూపురం రెండో పట్టణ స్టేషన్ స్థానిక డీఎస్పీ మహేశ్ తో కలసి పోలీసులతో సమావేశమయ్యారు. హిందూపురం ప్రాంతంలో ఇటీవల చోటు చేసుకున్న సంఘటనల దృష్ట్యా పోలీసులు అసాంఘిక శక్తులతో చేతులు కలిపినా.. నేరాలను ప్రోత్సహించినా.. బాధితులకు అన్యాయం చేసినా క్షమించేది లేదని తేల్చిచెప్పారు. హిందూపురం ప్రాంతంలో నేరాలను అదుపు చేయడంతో పాటు అసాంఘిక శక్తులు ఆటలు కట్టడి చేసి, ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే తన ప్రధాన ప్రాధాన్యత అంశమని, ఈ విషయాన్ని హెూం గార్డు మొదలుకొని ప్రతి పోలీస్ అధికారి గుర్తు పెట్టుకొని పని చేయాలని వివరించారు. హిందూపురం అంటే ప్రశాంతతకు మారుపేరని, ఈ ప్రాంత ప్రజలు కూడా చాలా సౌమ్యులని, ఈ ప్రాంతానికి ఉన్న పేరు, ప్రఖ్యాతుల దృష్ట్యా వాటికి భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత పోలీస్ శాఖపై ఉందన్నారు. ప్రజల సహకారంతో ప్రధాన రహదారుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తామని ఎస్పీ ప్రకటించారు. వీటి ఏర్పాటుతో ప్రమాదాలు, చోరీలే గాక అన్ని రకాల నేరాలలో పురోగతి సాధించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. రాత్రిళ్లు ప్రధాన వీధులతో పాటు శివారు ప్రాంతాల్లో రెండు డ్రోన్ కెమెరాలతో పోలీసులు గస్తీ తిరుగుతారని వెల్లడించారు. పోలీస్ శాఖకు సంబంధించిన ఆస్తులు ఆక్రమణకు గురి కాకుండా తగు చర్యలు తీసుకుంటామని ఎస్పీ రత్న తెలిపారు. సివిల్ కేసులు, కోర్టు పరిధిలో ఉన్న కేసుల్లో తలదూర్చవద్దని ఆదేశించారు. హిందూపురంలో త్వరలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తామని ఎస్పీ వెల్లడించారు. గ్యాంగ్ రేప్ కేసులో డీ.ఎన్. ఏ రిపోర్ట్ అందాల్సి ఉంది. చిలమత్తూరు మండలంలో జరిగిన గ్యాంగ్ రేప్ కేసులో ఎప్పటికప్పుడు ఫాలో అప్ లో ఉన్నామని, అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని స్పష్టం చేశారు. అత్తా కోడలిపై జరిగిన సామూహిక అత్యాచారం కేసుకు సంబంధించి డీ.ఎన్.ఏ నివేదిక అందాల్సి ఉందని ఎస్పీ రత్న తెలిపారు. హిందూపురం ప్రాంత ప్రత్యేకతను దృష్టిలో పెట్టుకొని సమర్థులైన పోలీసులను త్వరలో నియమించి ఈ ప్రాంతంలో శాంతి భద్రతలు కాపాడి, ప్రశాంత వాతావరణం కల్పిస్తామని ఎస్పీ పునరుద్ఘాటించారు. సమావేశంలో సీఐలు రాజగోపాల్ నాయుడు, ఆంజనేయులు, కరీం, జనార్దన్, ఎస్.ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# హిందూపురంలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

**- జిల్లా ఏస్ పీ వి.రత్న**



**హిందూపురం టౌన్ - సూర్య వాస్తవం:** హిందూపురం ప్రాంతంలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టడమే గాక అసాంఘిక కార్యకలాపాల నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఏస్ పీ వి.రత్న ఐపీఎస్ తెలిపారు. శనివారం హిందూపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో జిల్లా ఏస్ పీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎస్పీ కె వి మహేష్ తో పాటు సిఐలు, ఎస్సైలతో హిందూపురంలోని శాంతిభద్రతల విషయంపై సమీక్షించారు. ఏస్ పీ మాట్లాడుతూ జిల్లాలో అతిపెద్ద పట్టణంగా పేరు ఉన్న హిందూపురం ప్రాంతంలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రధానంగా అసాంఘిక కార్యకలాపాలను అడ్డకట్ట వేయడానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని, పబ్లిక్ సహకారంతో ప్రధాన రహదారుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. దీని ద్వారా ప్రమాదాలు దొంగతనాలు గుర్తించడానికి అవకాశం ఉంటుందని తెలియజేశారు. అదేవిధంగా రాత్రి వేళల్లో ప్రధాన వీధులతోపాటు శివార ప్రాంతాల్లో రెండు డ్రోన్ కెమెరాల ద్వారా పోలీస్ గస్తీ తిరగడం జరుగుతుందన్నారు. పోలీస్ శాఖకు సంబంధించిన ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని త్వరలోనే పోలీస్ శాఖ ద్వారా పట్టణంలో పెట్రోల్ బంక్ ప్రారంభించడం జరుగుతుందని ఏస్ పీ స్పష్టం చేశారు. చిలమత్తూరు మండలంలో జరిగిన గ్యాంగ్ రేప్ సంఘటన దృష్టిలో ఉంచుకొని గంజాయి రవాణా విక్రయాలపై ప్రత్యేక నిఘా వేశామన్నారు గ్యాంగ్‌రేప్ పట్ల ఎప్పటికప్పుడు ఫాలో అప్ లో ఉన్నామని ఇప్పటికే విచారణ చేశామని మరింత లోతుగా విచారణ చేస్తున్నామని దీనిలో డీఎన్ఏ రిపోర్ట్ రావాల్సి ఉందన్నారు. జిల్లాలో శాంతి భద్రతలు పరిరక్షించడంలో సిబ్బంది తప్పు చేస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని ఏస్ పీ హెచ్చరించారు. హిందూపురం సబ్ డివిజన్ కు త్వరలోనే మంచి పోలీస్ సిబ్బందిని నియమించి హిందూపురం ప్రాంతాన్ని ప్రశాంత వాతావరణంలోకి తీసుకొస్తామని ఏస్ పీ తెలిపారు. సమావేశంలో ఏస్ పీ తో పాటు డీఎస్పీ కేవీ మహేష్, సి ఐ లు రాజగోపాల్ నాయుడు ఆంజనేయులు కరీం, జనార్ధన్, ఎస్ఐలు పాల్గొన్నారు.

# కష్టపడిన వారికి పార్టీలో గుర్తింపు లేదు




**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం:** కష్టపడి పనిచేసి పార్టీ గెలుపుకు కృషి చేసిన వారికి టిడిపి పార్టీలో తగిన గుర్తింపు ర లేదని ఐ ఎం ఎం మహబూబ్ బాషా తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యక ర్తలకు మంచి భవిష్యత్ ఉంటుందని కార్యకర్తలను ఉద్దేశించి సీఎం చంద్రబాబు నాయుడు పదేపదే చెప్పడం తెలిసిందే.... అయితే పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన వారికి ఫలితం లేదని పార్టీలో కొందరు వారి బాధను వెలిబుచ్చుకుంటున్నారు. పార్టీ కోసం కష్టపడేవారికి తగిన ప్రాధాన్యత ఉంటుందని అందుకు పార్టీని నమ్ముకొని వారిపై కేసులు సైతం పట్టించుకున్న నాయకులు ఉన్నరని కష్టపడి పార్టీ విజయానికి పనిచేసిన కార్యకర్తలకు టిడిపిలో గుర్తింపు లేదని ఐ ఎం ఎం మహబూబ్ బాషా తన బాధ నీ మీడియా ముఖంగా తెలియపరిచారు. ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థి గెలుపునకు మసీద్, మద్రాసాలు, మైనార్టీల ఇళ్ల దగ్గరికి తిరిగి పార్టీ కోసం కష్టపడి ఓట్లు వేయించామని అయినా పార్టీ నామినేట్ పదవులల్లో జిల్లాలో మైనార్టీ వర్గానికి మొండి చేయి చూపిందని తెలియజేశారు. పార్టీ కార్యక్రమాల కోసం ఆర్థికంగా కూడా దెబ్బతిన్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత కష్టపడినా తనలాంటి వారికి పార్టీలో ఎటువంటి గుర్తింపు లేదని ఆయన వాపోయారు. గత వైసిపి ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీలకు మంచి గుర్తింపు ఉందని అందుకు నిదర్శనం మేయర్, మార్కెట్ యార్డ్ చైర్మన్, ఉర్దూ అకాడమీ, ముస్లిం మైనార్టీలకు కేటాయించి మైనార్టీలపై వైసిపి ఉన్న ప్రేమను చూపిందన్నారు. టిడిపి పార్టీలో పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ ముస్లిం మైనార్టీలకు తగిన గుర్తింపు లభించడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికైనా పార్టీ కోసం ఎవరు నిజంగా కష్టపడి పనిచేశారు గుర్తించాల్సిన అవసరం, బాధ్యత అధిష్టానానికి ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు.

# డ్వాక్రా సంఘాల సభ్యుల ఆవేదన



**పామిడి - సూర్య వాస్తవం:** పామిడి మండలంలో ఉన్నటువంటి డ్వాక్రా సంఘాలకి రెండు నెలలు గడుస్తున్న టౌన్ మిషన్ కోఆర్డినేటర్ అధికారి లేనందున తీవ్ర ఇబ్బంది పడుతున్నామని పామిడి పట్టణంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) లో ఉన్న మహిళా సంఘాల సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొదుపు సంఘ మహిళలు మాట్లాడుతూ పామిడి పట్టణంలొ గత 35 సంవత్సరాలు నుండి ఇప్పటివరకు 485 సంఘాలు ఏర్పాటు చేసుకున్నామని, ఈ 485 సంఘాల్లో 4892 మంది సభ్యులు ఉన్నారాన్నారు. సంఘంలో నుండి పొదుపు చేసుకున్న మొత్తంలో సంఘం సభ్యులు డబ్బులూ డ్రా చెయ్యడానికి వెళ్ళగా మెప్మా అధికారి సంతకం లేనిది బ్యాంకు వారు డబ్బులు డ్రా చేయడానికి అనుమతి లేదని కావున సంఘం సభ్యులు అత్యవసరంగా మెప్మా అధికారిని కొరకు వెళ్లగా గత రెండు నెలలుగా ఇక్కడ ఏ అధికారులు లేరని చెప్పడం జరిగిందన్నారు. సెప్టెంబర్ 28 తేదీన మెప్మా అధికారి జనరల్ ట్రాన్ఫర్ లో వేరే పట్టణానికి బదిలీ చేసారని బదిలీ చేసిన తారీకు నుండి ఏ అధికారి 2 నెలల నుంచి నియమించలేదు. కాబట్టి మెప్మా అధికారి గురించి పట్టణంలో సంఘాల సభ్యులు వివరణ అడగ్గా మీకు డిఆర్డిఏ వెలుగులో వెళ్ళమన్నారని అక్కడికి వెళ్ళగా తిరిగి పంపించారన్నారు. పై అధికారులు వెంటనే స్పందించి త్వరలోనే అధికారిని నియమించాలని డ్వాక్రా సంఘాల లీడర్లు కోరారు.

# కూటమి ప్రభుత్వంపై దాదా గాంధీ ఫైర్




**అనంతపురం - సూర్య వాస్తవం:** యన్.డి.ఎ. కూటమి ప్రభుత్వం ప్రజలకు గుటం పెడుతూ ప్రజల నడ్డి విరుస్తుంది అంటూ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు దాదా గాంధీ ఫైర్ అయ్యారు. సైకో ప్రభుత్వాన్ని ప్రక్కన పెట్టి యన్.డి.ఎ. ప్రభుత్వానికి అవకాశం ఇస్తే దోచుకో దాచుకో అన్నట్లు వ్యవహరిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన విద్యుత్ చార్జీల ను వెంటనే తగ్గించాలనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కి అయన డిమాండ్ చేశారు. విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు దాదా గాంధీ ఆధ్వర్యంలో అనంతపురంలోని టవర్ క్లాక్ సర్కిల్ వద్ద కాంగ్రెస్ పార్టీ మందు బాటిల్ బుడ్డీ లను చూపిస్తూ ప్లకార్డులతో చేపట్టి నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి డిసీసీ జిల్లా అధ్యక్షుడు రాకెట్ల మధుసూధన్ రెడ్డి హాజరు కావడం జరిగింది. అనంతరం నినాదాలు చేస్తూ ప్లకార్డులతో టవర్ క్లాక్ నుండి కాంగ్రెస్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు దాదా గాంధీ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అభివృద్ధి చేస్తామని చెప్పి వినాశనం చేస్తున్నారు. సూపర్ సిక్స్ పథకాలు అన్నారు కనీసం ఒక్క పథకం అయిన ప్రజలకు చేరిందా. చంద్రబాబు యొక్క 40 ఏండ్ల అనుభవం, పవన్ కళ్యాణ్ యొక్క ఆవేశ పూరితమైన మాటలను ప్రజలు నమ్మి ఓట్లేసి గెలిపిస్తే ఆ ప్రజలను మోసం చేస్తున్నారు. ఎన్డీఏ డబ్బులు ఇంజన్ సర్కార్ వస్తే అభివృద్ధి జరుగుతుంది అని బిజెపి జమిలి ఎన్నికలకు కూడా పోతా వుంది. డబుల్ ఇంజన్ సర్కారు వల్ల ఉపయోగం ఏముంది, డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని అందరూ ఊహించాం. దేశంలో రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ వున్న మన రాష్ట్రం లో అభివృద్ధి ఎక్కడ? రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఏంటి అని ఆలోచన చేయకుండా కేంద్రం మొండి చెయ్యి చూపిస్తోంది. ఈ రాష్ట్రానికి కావలసిన ఉద్యోగాల ఎక్కడున్నాయి, ఈ రాష్ట్రానికి కావాల్సిన నీళ్లు ఏవి, వెనుకబడిన రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రజల భవిష్యత్తు ఎలా వుండబోతోంది. పెరిగిన నిత్యవసర ధరలతో, సామాన్య ప్రజలు కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి. మహిళలకు ఉచిత బస్సు అన్నారు అమలు ఎక్కడ, అమ్మకు వందనం అన్నారు అమలు ఎక్కడ, అదేవిధంగా విద్యుత్ చార్జీల బిల్లులు పెంపు అన్నారు ఇలా అబద్దాల హామీలతో రాష్ట్ర ప్రజల జీవితాలను యన్.డి.ఏ. ప్రభుత్వం నాశనం చేస్తోంది అని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెరిగిన విద్యుత్ చార్జీలను తగ్గించేలా చూడాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ చార్జీల బిల్లులు తగ్గించే వరకు ఉద్యమాలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. డీసీసీ అధ్యక్షుడు రాకెట్ల మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ. యన్.డి.ఏ. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి 5 నెలల్లోనే ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారు. అత్యంత దారుణంగా కరెంటు చార్జీల భారాన్ని మోపుతున్నారు. ఇప్పటికే మొత్తం రూ.17 వేలకోట్లు సర్దుబాటు కింద మోపుతున్నారు. ప్రజలు ఏం పాపం చేశారు చంద్రబాబు ? పవన్ కల్యాణ్ అని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు విద్యుత్ ఛార్జీలపై ఎన్నో హామీలు ఇచ్చారు. వైసీపీ 9 సార్లు ఛార్జీలు పెంచిందని గగ్గోలు పెట్టారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంటే ఇది జరిగేది కాదంటూ ప్రగల్భాలు పలికారు. తీరా అధికారంలో వచ్చాకా మాట మార్చారు. మీకు ఓట్లు వేయడం ప్రజలు చేసిన పాపమా ? ప్రతిపక్షంలో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోరా ? జగన్ మోహన్ రెడ్డి గారు 5 ఏళ్లలో రూ.35 వేల కోట్లు భారం మోపి సైకో పాలన అందజేస్తే ప్రజలు ఓట్లతో బుద్ధి చెప్పి సాగనంపారు. మీ 5 నెలల పాలనలో రూ.17 వేల కోట్లు భారమా ? ఇది న్యాయమా చంద్రబాబు ? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాకే శంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్ యాదవ్, యం.యం.డి.ఇమామ్, రాం చరణ్, యూత్ కాంగ్రెస్ నాయకులు పరమేశ్వర్ రెడ్డి, శర్మాస్ వలి, హాజీ బషీర్ అహ్మద్, ఇంతియాజ్, యన్.యస్.యు.ఐ. నాయకులు ఓబీలేషు, నిశాంత్, ఒబిరెడ్డి, మూర్తి, ప్రసాద్ రెడ్డి, పోలక్కా, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.


# 'అనంత' ను దేశంలోనే మొదటి స్థానంలో నిలబెట్టాలి

- వినియోగదారులు పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ప్రతి ఒక్కరి ఇళ్లలో సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవాలి
- కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**అనంతపురం బ్యూరో - సూర్య వాస్తవం:** ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం అమలులో అనంతపురం జిల్లాను దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం అనంతపురం నగరంలోని జెఎన్టీయు రోడ్ లో ఉన్న ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయ ప్రాంగణంలో ఆ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్.ఈ) కొమ్ము సంపత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రధానమంత్రి సూర్యఘర్ మేళా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లి యోజన ఎంతో మంచి పథకం అని, దీని ద్వారా రాయితీతో మీ ఇంటిపై సోలార్ రూఫ్ టాఫ్ నిర్మించుకోండి. విద్యుత్ బిల్లు తగ్గించుకోవాలన్నారు. అనంతపురం జిల్లాలో వర్షపాతం, మేఘాలు తక్కువని, ఎండ విపరీతంగా ఉంటుందని, ఈ ప్రయోజనాన్ని ఉపయోగించు కోవాలన్నారు. ఆగస్టు 6 వ తేదీన జరిగిన కలెక్టర్స్ కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి పీఎం సూర్యఘర్ గురించి చెప్పారని, జిల్లాలో సూర్యరశ్మికిరణ శక్తిని, సోలార్ శక్తిని వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవా లన్నారు. పీఎం సూర్యఘర్ పథకం అమలులో రాష్ట్రంలోనే జిల్లాను మొట్టమొదటి స్థానంలో నిలపాలని, దేశంలో కూడా నెంబర్ వన్ స్థానంలో నిలబట్టేందుకు కృషి చేయాలన్నారు. అధికారులు, బ్యాంకర్లు, విద్యుత్తు వినియోగదారులు ఈ పథకం అమలులో ఎంత ముఖ్యమని, నగరంలో మూడు లక్షల జనాభా ఉంటే జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, 32 మండలాలలో అన్నిచోట్ల ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలన్నారు. ప్రతి ఒక్కరి ఇళ్లలో సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవాలని, ఇందుకు ప్రతి ఒక్కరికి అవకాశం ఉందని, జిల్లాలో క్యాంపెయిన్ మోడ్ లో ఈ పథకాన్ని సంపూర్ణంగా చేపట్టాలన్నారు. ప్రభుత్వ పథకాలను సంతృప్తికర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, పథకాల ద్వారా లబ్ధిదారులు లాభాలు పొందాలంటే అధికారులు, బ్యాంకర్లు కమ్యూనికేషన్ నైపుణ్యాలు కలిగి ఉండాలని, 100 శాతం పథకాల లబ్ధి ప్రతి ఒక్కరికి చేకూర్చాలన్నారు. జిల్లాలో పవర్ గ్రిడ్, సోలార్ పార్క్ లు రాబోతున్నాయన్నారు. జిల్లాలో రెండు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అందులో జిల్లాలో పడిన ప్రతి ఒక్క చుక్కనీరు అక్కడే ఇంకిపోయేలా చూడాలని, జిల్లాపై పడ్డ ప్రతి సూర్యకిరణాన్ని ఉపయోగించుకోవాలన్నారు. పీఎం సూర్యఘర్ మేళా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని అన్ని వివరాలు తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కి శాలువా కప్పి గౌతమ బుద్ధుని విగ్రహాన్ని అందజేసి ఎస్ఈలు, అధికారులు సన్మానించారు. అక్కడే ఏర్పాటుచేసిన సోలార్ రూఫ్ టాప్ కౌంటర్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్కో ఎస్ఈ వరప్రసాద్, ఈఈలు జేవి రమేష్, రాజశేఖర్, శేషాద్రి శేఖర్, ప్రసాద్, బ్యాంకర్లు, విద్యుత్, ట్రాన్స్కో అధికారులు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

# సీపీఎం ప్రజా పోరుయాత్ర



**అనంతపురం - సూర్య వాస్తవం:** సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ పిలుపుమేరకు "ప్రజా పోరుయాత్ర" శనివారం నాడు అనంతపురం నగర న్యూ కమిటీ ఆధ్వర్యంలో రూరల్ మండలంలోని చిన్మయినగర్ , రామకృష్ణ కాలనీ, జె.ఎన్.టి.యు మెయిన్ రోడ్డు మీదుగా పాద యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర నాయకులు కామ్రేడ్ ఓబులు హాజరై మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ఎన్ డి ఏ పరిపాలన వల్ల నిత్యవసర సరుకులు ధరలు విపరీతంగా పెరగడం జరిగినది. నిత్యవసర సరుకుల ధరలు తగ్గించడానికి కేంద్రంలో ఉన్న బిజెపి ఎన్ డి ఏ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదనీ పెట్రోలు డీజిల్ క్రూడాయిలు ధరలు అంతర్జాతీయంగా తగ్గినప్పటికీ దేశంలో పెట్రోల్ డీజిల్ రేట్లు తగ్గలేదన్నారు. నిరుద్యోగ సమస్య విపరీతంగా పెరిగినది, వీటని పక్కదారి పట్టించడానికి కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వము జమిలి ఎన్నికలనే కొత్త పేరుతో దేశంలోని ప్రజలను మోసం చేయడానికి మరొక ఎత్తుగడ వేస్తుందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో జమిలి ఎన్నికలు ఒకే దేశం ఒకే ఎన్నిక అనేది సాధ్యం కాని అంశము. ఒక రాష్ట్రంలో ఎన్నికలు ఐదు దఫాలుగా చేస్తూ ఉంటే దేశవ్యాప్తంగా ఒకే సారి ఎన్నికలు సాధ్యం గాని విషయము. కానీ ప్రభుత్వము జమిలి ఎన్నికలకే ముగ్గు చూపుతున్నది వెంటనే వాటిని ఉపసంహరించాలనీ రాష్ట్రంలోని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం గత పాలకులు కరెంటు చార్జీలు విపరీతంగా పెంచరాన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం కూడా ట్రూ అప్ చార్జీల పేరుతో దాదాపు 12 వేల కోట్ల పైబడి ప్రజల మీద భారం వేయడానికి సిద్ధమైనది వెంటనే వీటిని ఉపసంహరించాలనీ రాష్ట్ర ప్రభుత్వం కూడా నిరుద్యోగ సమస్యను నివారించాలి. ఇసుకను ఉచితంగా ఇవ్వడం మరింత వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ రెడ్డి, న్యూ కమిటీ కార్యదర్శి ఆర్ వి నాయుడు, కార్యవర్గ సభ్యులు ముర్తుజా, ఇర్ఫాన్, ఏటీఎం నాగరాజు మహిళా సంఘం నాయకురాలు చంద్రిక కాలనీ కమిటీ సభ్యులు శంకరు, నల్లప్ప, ప్రసాదు ప్రమీల, సిద్ధా కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ అవార్డ్ టీచర్స్‌కు అదనపు ఇంక్రిమెంట్ పెంచాలని సీఎంకు వినతి



**నార్పల - సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ అవార్డు టీచర్స్ కుఒక అదనపు ఇంక్రిమెంట్ పెంచాలని ఆంధ్రప్రదేశ్ అవార్డు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు సీఎం చంద్ర బాబును విజయవాడలో కలసి వినతిపత్రం అందజేశారు. ఆల్ ఇండియా అవార్డిటీచర్స్ అసోసియేషన్ ఫౌండర్ అధ్యక్షులు బెక్కంటి శ్రీనివాసరావు సూచనలు ప్రకారం రాష్ట్రప్రగతికి సామాజిక సేవ లోను ఉత్తమ ఉపాధ్యాయులు ముందుగా నిలవాలి అనే సదాశయంతో రాష్ట్రంలోని అన్నా క్యాంటీన్ నిర్వహణ కోసం ఆంధ్ర ప్రదేశ్ అవార్డు టీచర్స్ అసోసియేషన్ (ఆటా -ఆం ప్ర.)రాష్ట్ర కార్యవర్గం అసోసియేషన్ కార్యవర్గం తరుపున లక్ష రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం అందించడం జరిగిందన్నారు. అసోసియేషన్ (వర్కింగ్) అధ్యక్షులుడాక్టర్ కొఠారి వెంకటరత్నం ఎం.నారాయణ స్వామిలు మాట్లాడుతూ పలు రాష్ట్రములలో అమలు జరుగు తున్ననూ గత ప్రభుత్వం వారు నిలుపుదల చేసిన జీవో నెంబర్ 101-అమలు అవార్డి టీచర్లకు ఒక అదనపు ఇంక్రిమెంట్, బదిలీలలో ప్రాధాన్యత పాయింట్లులను గురించి ముఖ్యమంత్రికి విన్నవించి వినతి పత్రం అందించామన్నరు. దీనికి ముఖ్యమంత్రి సాదరంగా సమస్యలను విని సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ముఖ్య మంత్రికి సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలియజేసామన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ అవార్డు టీచర్స్ అసోసియేషన్ వర్కింగ్ అధ్యక్షులు కొఠారి వెంకటరత్నం, ప్రధాన కార్యద్శులు కావూరి గురుముర్తి, ఎం.నారాయణస్వామి, బి. ఎం గోపాలరెడ్డి, ఆట ఇండియా జాతీయ నాయకులు కైకేపల్లి దాసు తదితరలు పాల్గొన్నారు.


## శైవ క్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు

- కదిరి నుంచి శ్రీశైలం, అరుణాచలంకు బస్సులు
- డిపో మేనేజర్ మైనుద్దీన్



**శ్రీ సత్యసాయి జిల్లా - సూర్య వాస్తవం:** శివ భక్తుల సౌకర్యార్ధం శైవ క్షేత్రాలైన శ్రీశైలం, అరుణాచలానికి కదిరి నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు కదిరి ఆర్టీసీ డిపో మేనేజర్ బి.మైనుద్దీన్ తెలిపారు. శివుడికి అత్యంత ప్రీతి కరమైన కార్తీక మాసంలో శివ దర్శనం చేసుకొనే భక్తుల సౌకర్యార్థం ప్రతి ఆదివారం స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు వివరించారు. ఈ నెల 10, 17, 24 తేదీల్లో కదిరి నుంచి స్పెషల్ బస్సులు నడపనున్నట్లు వెల్లడించారు. త్రిలింగ దర్శనం (బుగ్గ రామలింగేశ్వరస్వామి (తాడిపత్రి), యాగంటి, మహానంది), కోటిలింగాలు, ఈషా ఫౌండేషన్ (చిక్ బళ్లాపురం) తదితర ప్రదేశాలకు ప్రతి సోమవారం(ఈనెల 11, 18, 25 తేదీలలో ప్రత్యేక బస్సులు నడుస్తాయని తెలిపారు. ఇంకా భక్తుల కోరిక మేరకు కూడా కోరుకున్న ప్రదేశాలకు స్పెషల్ బస్సులు ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని డిపో మేనేజర్ మైనుద్దీన్ తెలిపారు. పూర్తి వివరాల కోసం సెల్: 9959225892 నంబర్ కు కాల్ చేసి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

## అర్హులందరూ ఓటు హక్కును నమోదు చేసుకోండి



**పత్తికొండ - సూర్య వాస్తవం:** అర్హులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని రెవెన్యూ విభాగపు అధికారి భరత్ నాయక్ అన్నారు. ప్రత్యేక ఓటర్ నమోదు శిబిరాలను ఆయన పరిశీలించారు. శనివారం, ఆదివారం ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ రెండు రోజులు ప్రతి పోలింగ్ బూతులో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బిఎల్వోలు అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## ప్రజా పోరు గోడపత్రికల ఆవిష్కరణ



**పత్తికొండ - సూర్య వాస్తవం:** ప్రజా సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం పార్టీ ప్రజా పోరు కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా పత్తికొండలో స్థానిక ఈశ్వర్ రెడ్డి భవనంలో ప్రజా పోరు గోడపత్రికలను నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి రంగారెడ్డి మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటిన ప్రజా సమస్యలను పరిష్కరించడం లేదని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని అన్నారు. రాష్ట్రంలో నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని ఉచిత ఇసుక ఇస్తామని చెప్పి ఇసుక దొరక్కుండా చేశారని, దీంతో భవన నిర్మాణ కార్మికులు పస్తులుండే పరిస్థితి ఏర్పడిందని విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి, ఇప్పుడు 6000 కోట్ల రూపాయలు ప్రజలపై మోపాలని విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేట్ పరం కాకుండా చేస్తామని చెప్పి, దాన్ని గురించి మాట్లాడడం లేదని అనేక హామీలు ఇచ్చి అమలు చేయడం లేదని ప్రజా సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్రవ్యాప్తంగా ప్రజా పోరుతో ఈ నెల 14 వ తేదీన తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టబోతున్నామని, జయప్రదం చేయాలని, మండల ప్రజలను ఆయన కోరారు పాల్గొన్నవారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. దస్తగిరి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి, అమ్మాలి యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# అమర వీరుడు షహీద్ టిప్పు సుల్తాన్

## భారత మాతృభూమి కోసం బ్రిటిష్ వారికి తల వంచని ధీరుడు




**"తోడేలులా వంద సంవత్సరాలు బతకడం కంటే పులిలా ఒక్కరోజు బతకడం మేలు" - భారతదేశం గర్వించదగ్గ స్వాతంత్ర్య సమర యోధుడు షహీద్ టిప్పు సుల్తాన్.**

మాతృభూమి కోసం వీరమరణాన్ని ఆహ్వానించి నక్కలాగా వందేళ్లు బతికే కన్నా పులిలా ఒక్క రోజు బతికితే చాలు"అని ఆ సందేశాన్ని భారతీయ దేశ భక్తులకు ఆచరణాత్మకంగా ప్రాణాలు అర్పించి దేశభక్తుల సరసన నిలిచిన మైసూరు పులి షహీద్ టిప్పు సుల్తాన్. మాతృభూమి కోసం ఆంగ్లేయులతో పోరాడి యుద్ధరంగంలో అసువులు బాసిన మొట్టమొదటి యోధుడు టిప్పు సుల్తాన్ 1750 నవంబర్ 10. దేవనహల్లి లో జన్మించారు. మన భారతదేశాన్ని ఆక్రమించడానికి వచ్చిన బ్రిటీష్ సామ్రాజ్యవాద ముష్కరులతో పోరాడి యుద్ధరంగంలోనే నేలకొరిగిన మొట్టమొదటి యోధుడు టిప్పుసుల్తాన్ అని చెప్పవచ్చు. టిప్పు సుల్తాన్ మత సామరస్యం ,పరమత సహనం, సోదరభావం, వసుధైక కుటుంబ నిర్మాణం కోసం చివరి శ్వాస వరకు అహర్నిశలు ఉద్యమించిన మహా మనీషి అని చెప్పుకోవచ్చు. 1791లో మరాఠా సైన్యం శృంగేరి శంకరాచార్యుల మఠంపై దాడిచేసి అనేక మందిని చంపేసినారు. వందలాది మంది క్షతగాత్రులైనారు. మఠంలోని విలువైన వస్తువులు దోచుకొన్నారు. సర్వం కోల్పోయిన శంకరాచార్యుల వారు టిప్పు సుల్తాన్ సహాయం కోరారు. శంకరాచార్యులకు, టిప్పు సుల్తాను ఈ మేరకు కన్నడ భాషలో 30 ఉత్తర ప్రత్యుత్తరాలను 1916లో మైసూరు పురాతత్వ డైరెక్టర్ కనుగొన్నారు. మరాఠా సైనిక దాడి పట్ల టిప్పు తీవ్ర మనోవేదన వ్యక్తం చేశారు. వెంటనే శంకరాచార్యుల వారికి 200 రహతిలు డబ్బు, ఇతర వస్తువులను అందజేయాలని బెద్నూరు అధికారి ని ఆదేశించారు. టిప్పు సుల్తాన్ హిందూ మతాచారాలను గౌరవించేవాడని, చరిత్రకారుడు బిఎ సాలెతొరె పేర్కొన్నాడు. మేల్కోటేలోని వైష్ణవ దేవాలయాన్ని సకల విధాల పోషించుటమే కాకుండా అక్కడ వైష్ణవ కీర్తనలు సంప్రదాయ పద్ధతిలో పఠించాలన్నాడు. మేల్కోటే దేవాలయంలో ఇప్పటికీ టిప్పు సుల్తాన్ బహుకరించినట్లు వ్రాసిన బంగారు, వెండి పాత్రలున్నాయి. 1782 నుండి తను చనిపోయే వరకు ఆయన తన రాజ్యంలో ఉన్న దేవాలయాలకు 34 అగ్రహారాలు ఇచ్చినట్లు రికార్డులున్నాయి. అనేక దేవాలయాలకు బంగారు, వెండి ఆభరణాలిచ్చాడు.
నంజన్గుడి శ్రీకంఠేశ్వర దేవాలయానికి ఆయన బహుకరించిన విలువైన రాళ్ళు పొందిగిన పై కప్పు ఇప్పటికీ వుంది. టిప్పు సుల్తాన్ రాజ్యంలో ముఖ్యమైన పదవుల్లో హిందువులు వుండేవారు. ఆయన కోశాధికారి కృష్ణారావు, తపాల, పోలీసు శాఖ మంత్రి శామయ్య అయ్యంగార్, ఆయన సోదరుడు రంగ అయ్యంగార్ ముఖ్యమైన ప్రభుత్వ అధికారి. టిప్పు సుల్తాన్ జమానాలో ముఖ్యమైన "మిర్ ఆషఫ్" పదవిని పూర్ణయ్య నిర్వహించేవాడు. మొఘల్ దర్బారులో టిప్పు సుల్తాన్ ఏజెంట్లుగా మూల్ చంద్, సుజన్ రాయ్ ఉండేవారు. ఆయన సైనికాధికారి "పేష్కార్"గా ఉన్న సుబ్బారావు హిందువే. సంస్కరణల అమలు విషయంలో వ్యక్తిగత కష్టనష్టాలను టిప్పుసుల్తాన్ ఖాతరు చేయలేదు. వ్యభిచారం, బానిసత్వం, బహుభర్తృత్వం, మధ్యపానాన్ని నిషేధించాడు. మలబారు మహిళలు నడుంపై భాగాన ఎటువంటి అచ్చాదన లేకుండా అర్ధనగ్నంగా తిరగటం గమనించి ఈ దురాచారాన్ని వివక్షను నిర్మూలన చేసి మహిళలంతా రవికలు ధరించాలని ఆజ్ఞలు జారీ చేసినాడు. నరబలులను నిషేధించాడు. పకీరులు-సన్యాసులు మాదక ద్రవ్యాలు తీసుకోవటం తీవ్రమైన నేరంగా పరిగణించాడు. అనాథలైన బాలికల క్రయ విక్రయాలు తీవ్ర నేరంగా ప్రకటించి పొగాకు సేవనం అనారోగ్యమని నిషేధించాడు. దుబారాలను తగ్గించాలని వ్యక్తి తన సంపాదనలో 1 శాతం కంటే ఎక్కువ విలాసాలకు ఖర్చు చేయరాదని ఆజ్ఞలు జారీ చేసినాడు. చిన్న చిన్న నేరాలకు పాల్పడిన వారికి విధించే శిక్షలు సమాజానికి ఉపయోగపడాలని భావించి, గ్రామ పొలిమేర్లలో మొక్కలు నాటి సక్రమంగా నీళ్ళుపోస్తూ పెరిగినంత వరకు వాటి సంరక్షణ బాధ్యత నిర్వహించాలని 1792లో శాసనం చేశాడు. అన్ని రంగాలలో ప్రజల ఉన్నతికి, వారి సంక్షేమానికి వినూత్న చర్యలు చేపట్టారు. ప్రజా జీవనరంగంలో పలు విప్లవాత్మక మార్పులు చేశారు. ఆ కారణంగా ఏర్పడిన అనుకూల వాతావరణాన్ని ప్రస్తావిస్తూ ప్రముఖ చరిత్రకారుడు జేమ్స్మల్ తన (హిస్టరీ ఆఫ్ బ్రిటీష్ ఇండియా) లో భారతదేశంలోని ఇతర ప్రాంతాల ప్రజలందరి కంటే టిప్పు రాజ్యంలోని ప్రజలు సంతోషంగా ఉన్నారు. పంటలు

బాగా పండుతున్నాయన్నారు. చేతి వృత్తి కళాకారులకు నిపుణులను రప్పించి శిక్షణ ఇప్పించాడు. నూతన తరహా సహకార బ్యాంకులను ఏర్పాటు చేశాడు. సంపన్న వర్గాల పెత్తనం తగ్గించేందుకు చర్యలు తీసుకొన్నాడు. తూనికలు-కొలతల వ్యవస్థను ఆధునీకరించాడు. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించి ఎగుమతులు చేపట్టాడు. నావికా వ్యాపారాన్ని వృద్ధి చేసి వర్తక-వాణిజ్య పారిశ్రామిక రంగాలలో ప్రభుత్వం పాత్రను అధికం చేస్తూ "ప్రభుత్వ వ్యాపార సంస్థను "స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్" ఏర్పాటు చేశాడు. వ్యవసాయ భూములకు నీటి పారుదల సౌకర్యం కల్పించేందుకు శ్రద్ధ వహించాడు. నాడు కావేరి నదిపై ఎక్కడైతే ప్రాజెక్టు కట్టాలని ఆయన ఉద్దేశించాడో, ఈనాడు "కృష్ణరాయసాగర్" అక్కడే నిర్మాణమైంది. శాస్త్ర, సాంకేతిక రంగంలో కూడా టిప్పు సుల్తాన్ తన కాలానికి మించిన ఆవిష్కరణలు చేశాడు. ముఖ్యంగా సైనికరాకెట్ల విషయంలో రూపకల్పనలో ఆయన గొప్ప అద్భుతాలు సాధించాడు. ఆయన హయాలో రూపొందించబడిన కాంగ్రీవ్ రాకెట్లు ఆనాడు బ్రిటీష్ టెక్నాలజీని మించిపోయినాయి. యుద్ధ రంగంలోనేకాదు పారిశ్రామికంగా ఆయన అనేక విధాల పరిశోధనలు చేశాడు. మైసూరు పట్టుపరిశ్రమ ముందడగు వేసేందుకు కృషి చేశాడు. టిప్పు సుల్తాన్ తన తండ్రి హైదర్ అలీ నాయకత్వంలో 15వ ఏటనే యుద్ధరంగంలోకి దిగి యుద్ధ వ్యూహాల్లో రాటుదేలి 1782లో హైదర్ ఆలీ మరణం తరువాత ఆయన మైసూరు రాజ్యానికి సుల్తాన్ అయినాడు.
నిజానికి హైదర్ అలీ రాజరిక వంశం నుంచి వచ్చినవాడు కాదు. సామాన్య కుటుంబం నుంచి వచ్చి మైసూరు రాజు సైన్యంలో మెట్టుమెట్టు ఎదిగి చివరికి పాలకుడైనాడు. తన తండ్రిలాగే రాజ్యాన్ని విస్తరించే క్రమంలో టిప్పుసుల్తాన్.... విశ్వ ప్రయత్నాలు చేస్తున్న బ్రిటీష్ వారి తో మూడు యుద్ధాలు చేశాడు. చివరికి 1799లో బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ సేనలు మైసూరు రాజధాని శ్రీరంగపట్టణం కోటను దిగ్బందం గావించినప్పుడు టిప్పుసుల్తాన్ కోటను రక్షించుకునే క్రమంలో యుద్ధరంగంలోనే 1799, మే 4 పొందాడు .
బ్రిటిష్ సైన్యం నగర ప్రకారాలను పగులగొట్టి లోపలికి ప్రవేశిస్తుంటే టిప్పుకు సలహాదారుగా ఉన్న ఫ్రెంచ్ సైనికాధికారి ఆయనను రహస్య మార్గం గుండా తప్పించుకోవాలి అని సలహా ఇచ్చాడు. నక్కలాగా వందేళు బతికే కన్నా పులిలా ఒక్క రోజు బతికితే చాలు" అని చెప్పి ఆయన యుద్ధంలో వీరమరణం పొందాడు.

బ్రిటీష్ సామ్రాజ్యవాద దురాక్రమణను వ్యతిరేకించినందుకు తొలితరం బ్రిటీష్ చరిత్రకారులు టిప్పుసుల్తాన్కు వ్యతిరేకంగా రాసిన రాతల వెనుక కూడా ఇప్పటి టిప్పు సుల్తాన్ వ్యతిరేకులకు ఒక ప్రయోజనం వుంది. టిప్పు సుల్తాన్ బ్రిటీష్ సామ్రాజ్యవాదులను వ్యతిరేకించినందుకే నాటి చరిత్రకారులైన కిర్క్ పాట్రిక్, విల్కిస్ వారు ఆయనకు వ్యతిరేకంగా లేనిపోనివి రాశారని తదుపరి చరిత్రకారులైన బ్రిట్బాంక్, మొహిబుల్ హాసన్, ఎఎస్ చెట్టి, ఇర్ఫాన్ హబీబ్ వంటి వారు తెలియజేశారు.

నిజానికి టిప్పుకు వ్యతిరేకంగా వ్రాసిన కిరౌ పాట్రిక్, విల్కిస్లు టిప్పు సుల్తాన్కు వ్యతిరేకంగా యుద్ధాల్లో బ్రిటీష్ తరపున పాల్గొన్నారని, వారిద్దరూ టిప్పుతో పోరాడిన లార్డ్ కార్న్ వాలిస్, రిచర్డ్ వెల్లెసీలకు అతి సన్నిహితులని ప్రజా చరిత్రకారిణి బ్రిట్లీంక్ రాశారు.టిప్పు సుల్తాన్ పాలనలో చేతి వృత్తి కళాకారులకు నిపుణులను రప్పించి శిక్షణ ఇప్పించాడు.
టిప్పు సుల్తాన్ 1782 నుండి తను చనిపోయే వరకు ఆయన తన రాజ్యంలో ఉన్న దేవాలయాలకు 34 అగ్రహారాలు ఇచ్చినట్లు రికార్డులున్నాయి. అనేక దేవాలయాలకు బంగారు, వెండి ఆభరణాలిచ్చాడు. టిప్పు సుల్తాన్ మరణ వార్త జీర్ణించుకోలేక ఆత్మహత్య చేసుకొన్న టిప్పు సుల్తాన్ వీరాభిమాని మదనపల్లి రాజు ప్రపంచ జ్యుడిషియరీ రీఫార్మర్ శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్న టిప్పు సుల్తాన్ జాతీయ, అంతర్జాతీయ విషయాలపై వ్యక్త పరిచిన అభిప్రాయాలనూ, దౌత్య వ్యూహాలనూ ఆయన శత్రువు డోవ్ టన్ లాంటి బ్రిటిష్ అధికారి సైతం ప్రశంసించకుండా ఉండలేకపోయాడు. మసీదు-మందిరాల మధ్య ఎలాంటి తారతమ్యం చూపలేదు. మైసూరు రాజ్యంలోని అనేక ఆలయాలకు ప్రతి ఏడాది గ్రాంటులను, ప్రత్యేక నిధులను మంజూరు చేశాడు. ఈమేరకు టిప్పు సుల్తాన్ 156 ఫర్మానాలను జారీచేశాడు.
ఈస్టిండియా పాలకులతో పోరాడుతున్నా క్రైస్తవ మతాచార్యులను అమితంగా గౌరవించిన టిప్పు సుల్తాన్ ఫ్రెంచి విప్లవం తో యూరప్ లో వ్యాపించిన ఆధునిక లౌకిక భావజాలాన్ని భారతదేశం లో ప్రవేశ పెట్టడానికి ప్రయత్నించిన మొదటి పాలకుడు టిప్పు సుల్తాన్.

టిప్పు సుల్తాన్ సైన్యంలోని 19 మంది సేనాపతుల్లో 10 మంది... 13 మంది మంత్రులలో ఏడుగురు హిందువులేనని ప్రఖ్యాత చరిత్ర కారుడు బీఎన్ పాండే పేర్కొన్నారు. టిప్పు సుల్తాన్ పారిశ్రామిక, వాణిజ్య రంగంలో తీసుకు వచ్చిన ఆధునిక పోకడలు, యుద్ధ సాంకేతిక రంగంలో ఆయన తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులు మైసూరు రాజ్యాన్ని ఆనాడు భారత దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అత్యంత ఉన్నతమైన స్థానంలో నిలిపాయి టిప్పు సుల్తాన్ జాగీర్దారీ భూస్వామ్య వ్యవస్థను రద్దు చేశాడు. టిప్పు సుల్తాన్ మైసూరు రాజ్యంలోని వివిధ ప్రాంతాల్లోనే కాకుండా మస్కట్ (ప్రస్తుత ఒమన్ రాజధాని), జెడ్డా (సౌదీ నగరం), బస్రా (ఇరాక్ నగరం), పెగు (మ్యాన్మార్)లలో కూడా వాణిజ్య, పారిశ్రామిక కేంద్రాలు నెలకొల్పి అంతర్జాతీయ వాణిజ్యాన్ని అభివృద్ధి చేశాడు. 1970లో ఆర్ఎస్ఎస్ ప్రచురించిన 'భారత భారతి' పుస్తకంలో కూడా టిపు సుల్తాన్ను కీర్తిస్తూ రాశారే గాని వ్యతిరేకంగా రాయలేదు.
ప్రజలు మోసాలకు గురికాకుండా తూనికలు కొలతల వ్యవస్థను ఆధునీకరించాడు. టిప్పు సుల్తాన్ తన రాజ్యంలో మద్యపానం, వ్యభిచారాలను చాలా కఠినంగా నిషేధించాడు. గంజాయి వినియోగాన్నీ, సాగునూ నిషేధించాడు.

18వ శతాబ్దం చివరిలో యూరప్లోనే బ్రిటన్లో అత్యధిక జీవన ప్రమాణాలు, అత్యధిక నిజ వేతనాలు ఉండేవి. కానీ టిప్పు సుల్తాన్ హయాంలో మైసూర్ ప్రజల నిజవేతనాలు బ్రిటిన్ ను మించిపోయాయి. ఆ రోజున భారత దేశంలో (1990 అంతర్జాతీయ డాలరు ప్రకారం) సగటు జీవన వ్యవయం 400 డాలర్లు కాగా 1820లో నెదర్లాండ్స్లో 1,838 డాలర్లు, బ్రిటన్లో1,706 డాలర్లు ఉండేది. మైసూర్లో 2,000 డాలర్లు ఉండేది. సైనిక దళాల ప్రయాణం కోసం పెద్ద ఎత్తున రోడ్డు నిర్మాణాలు చేపట్టాడు. చామరాజ్ పేట లోని కోటె వెంకటరమణ దేవాలయాన్ని టిప్పు సుల్తాన్ తరచూ దేవాలయాన్ని సందర్శించేవారు క్రూరమైన దుర్మార్గగా అభం శుభం తెలియని పసి బాలికలను మహిళలను అనునిత్యం దారుణంగా అత్యాచారంచేసే దేవదాసీ పద్ధతి ని మహనీయుడు మహిళా పక్షపాతి టిప్పు సుల్తాన్ రద్దు చేసి అలాంటి దుర్మార్గులను కఠినం గా శిక్షంచాడు. టిప్పు సమర్థుడైన జనరల్ మరియు పరిపాలకుడు, మరియు, ముస్లిం అయినప్పటికీ, అతను తన హిందూ ప్రజల పట్ల విధేయతను నిలుపుకున్నాడు. అతను తన శత్రువుల పట్ల



క్రూరంగా ప్రవర్తించాడు. టిప్పు సుల్తాన్ వీరమరణం పొందిన రోజు అద్భుతమైన టిప్పు లైబ్రరీ కూడా చెక్కుచెదరలేదు. చరిత్ర, సైన్స్, మతానికి సంబంధించి అరబిక్, పర్షియన్, ఉర్దూ హిందీ భాషల్లో 2000కు పైగా పుస్తకాలు అందులో ఉన్నాయి. చరిత్ర ప్రకారం కేరళలో నాడ, నయ్యర్, తియ్యర్ ఇతర శూద్ర మహిళలు తమ శరీరం నిండుగా బట్టలు వేసుకోవడాన్ని నంబూద్రీలు నిషేధించి, అర్ధనగ్న సంప్రదాయాన్ని బలవంతంగా అమలు చేసారు. నాయర్ సామాజిక వర్గానికి చెందిన యువతి రవిక వేసుకుని శ్రీ పూర్ణత్రయీ గుడికి వెళితే ఆగ్రహించి ఆమె రవికను చించేసిన క్రూరమైన కాలమది.ఇలాంటి క్రూర మైన విధానాలను టిప్పు సుల్తాన్ వ్యతిరేకించి నిర్మూలన చేశాడు. బ్రిటిష్ వారి ముందు నిలబడ్డ ఒకే ఒక్క ప్రత్యర్థి టిప్పు. ఆయన కన్నా పెద్ద ప్రత్యర్థి బ్రిటీష్ వాళ్లకు లేరు. ఆయన తరువాత యుద్ధవిద్యలో బ్రిటిష్ వారిని సవాలు చేసేవారే లేకపోయారు" అని మేజర్ అలెగ్జాండర్ అలెన్ తన 'అన్ అకౌంట్ ఆఫ్ ద క్యాంపెయిన్ ఇన్ మైసూర్' పుస్తకంలో వివరించారు.
"టిప్పు ఓటమి తరువాత, తూర్పు సామ్రాజ్యం మొత్తం మన కాళ్ళ మీద పడింది" అని పీటర్ ఓబెర్ అనే ఆంగ్ల జర్నలిస్ట్ తన పుస్తకం, రైజ్ అండ్ ప్రోగ్రెస్ ఆఫ్ బ్రిటిష్ పవర్ ఇన్ ఇండియాలో రాశారు. టిప్పు సుల్తాన్,అగ్రవర్ణాలకు కానుకలు భారీగా భూములు, నిధులను కేటాయించటాన్ని వ్యతిరేకించి ఆ డబ్బును ఇబ్బందుల్లో ఉన్న ప్రజల సంక్షేమం కోసం ఖర్చు పెట్టారు. కులం, మతం పేరిట ఎన్నడూ వివక్ష ప్రదర్శించని గొప్ప మానవతావాది వెయ్యికిపైగా శూద్ర అమ్మాయిలు కాలికట్ రాజు సమూతిరి అంతఃపురంలో అర్ధనగ్నంగా పనిచేసేవారు. టిప్పు సుల్తాన్ కాలికట్ పై దండయాత్రతో సమూతిరికి బుద్ధి చెప్పికొరడా దెబ్బలు కొట్టి, వేలాదిమంది అర్ధనగ్న మహిళలను ఆ చెరనుండి స్వేచ్ఛనిచ్చారు. నైతిక హక్కులకు రక్షణగా నిలిచారు. నిండుగా బట్టలు వేసుకోమని చెప్పారు. కొంతమంది అపోహలకు మతోన్మాదుల అబద్ధపు ప్రచారాలకు నిలదీస్తూ ముస్లిం ప్రభుత్వమని మీకెవరు చెప్పారంటూ టిప్పు సుల్తాన్ తరచూ ప్రశ్నించేవారు.

మైసూరు జిల్లాలోని కాలలే గ్రామంలోని లక్ష్మీకాంత అనే గుడికి నాలుగు వెండి గిన్నెలను ఇతర బహుమానాలను బహూకరించి మతసామరస్యాన్ని చాటుకున్నారని ఎన్నోచారిత్రిక ఆధారాలుఉన్నాయి టిప్పు సుల్తాన్ రైతు ల బాధలను పరిశీలన చేసి వ్యవసాయ రంగమే దేశానికి ఆయువుపట్టుని చెబుతూ దూరదృష్టితో కావేరి నదిపై ఆనకట్ట నిర్మించాలనే ముందుచూపును ప్రదర్శించారు. ఈ వివరాలు కృష్ణరాజసాగర్ డ్యాం గేట్లపై లిఖించటం ఇప్పటకీ మనం చూడవచ్చు.
అందువల్ల దేశంలో మతోన్మోదాన్ని రెచ్చగొట్టి హిందూ, ముస్లిం మధ్య చిచ్చు పెట్టడానికి కొన్ని శక్తులు చరిత్రను వక్రీకరిస్తున్న చర్యల్లో భాగమే టిప్పు సుల్తాన్కు వ్యతిరేక ప్రచారం. కనీసం ఇప్పటికైనా టిప్పు సుల్తాన్ వ్యతిరేకులు చరిత్రను వక్రీకరించడం మాని దేశాభివృద్ధి కోసం వందల సంవత్సరాల క్రితమే ఎన్నో సంస్కరణలు, సంక్షేమం కోసం పాటుపడిన టిప్పు సుల్తాన్ వంటి యోధుని గురించి తప్పుడు ప్రచారాలు మానుకోవాలని, వారి వైఖరిలో మార్పు రావాలని కోరుకొంటున్నాము.



- వ్యాసకర్త
ఉమర్ ఫారూఖ్ ఖాన్
- అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్
జాతీయ అధ్యక్షుడు

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (FOUNDER -N.ARIF ALI )